
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





తెరపైకి పాత బ్రాండ్లు?

- కొన్ని రోజులుగా హడావుడి
- దుకాణాల్లో మాత్రం పిచ్చి బ్రాండ్లే
- మందుబాబులను ఆకర్షించడానికేనని విమర్శలు
- దుకాణాలకు చేరకుండానే పాత బ్రాండ్లు మాయం

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): పిచ్చి బ్రాండ్లతో విసిగిపోయిన మందుబాబులను ఆకట్టుకునేందుకు.. ప్రభుత్వ మద్యం దుకాణాలకు వారిని తిరిగి రాబట్టుకునేందుకు పాత బ్రాండ్ల పేరుతో కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ హడావుడి మొదలు పెట్టాయి. ఎన్నికలకు మరో రెండు నెలల సమయం ఉందనగా పాత బ్రాండ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు ప్రకటనలు, ప్రచారాలు ఊపందుకుంటున్నాయి.నాలుగున్నరేళ్లకు పైగా పాత బ్రాండ్ల ఊసెత్తని ప్రభుత్వం ఉన్నట్లుండి పాత బ్రాండ్లతో హడావుడి చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మద్యం బ్రాండ్ల పేరుతో ప్రభుత్వం చేస్తున్న హడావుడి మందుబాబుల కోసమా? వచ్చే ఎన్నికల కోసమా? అనేది ఇప్పుడు తేలాల్సిన ప్రశ్న. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొత్త బ్రాండ్లు నాసిరకంగా ఉండడంతో మందు బాబులు ముఖం చాటేస్తున్నారు. దీంతో పాత బ్రాండ్లను తెస్తామని ప్రభుత్వం కొన్ని రోజులుగా హడావుడి మొదలు పెట్టింది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో మూడు లిక్కర్ డిపోలు ఉండగా వాటి పరిధిలోని అన్ని ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పాత బ్రాండ్లు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. వాటితోపాటు బాపట్ల జిల్లా పరిధిలోని చీరాల డివిజన్లోని షాపుల్లో కూడా పాత బ్రాండ్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. నికోల్స్ బ్లాక్, నికోల్స్ గోల్డ్ ప్రీమియం బ్రాందీ, 100 పైపర్స్ విస్కీ, బ్లెండర్స్ ప్రైడ్ విస్కీ, రాయల్ స్టాగ్ విస్కీ, బాల్లెంటైన్స్ ఫైనెస్ట్ విస్కీ, ప్లాటినమ్ సుపీరియర్ వైట్ రమ్ము, ప్లాటినమ్ ఒరిజినల్ సిట్రస్ రమ్ము, వైట్ హాల్, మేన్షన్ హౌస్, ఓల్డ్ అడ్మిరల్, అరిస్ట్రోక్రాట్ ప్రీమియం, మార్ఫియస్, టీచర్స్ తదితర బ్రాండ్లను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలుస్తోంది.

ఓటు అడుగుతారా.. లేదా?

2024 ఎన్నికల నాటికి రాష్ట్రంలో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేసి, మద్యం అనేదాన్ని ఫైవ్ స్టార్ హోటళ్లకు పరిమితం చేసి, ఆ తర్వాతే ఓట్లడుగుతా.. అని ఎన్నికల ప్రచారంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. ఆయన చెప్పిన మాట నెరవేర్చుకోవడానికి సరిగ్గా నెలరోజుల సమయం మాత్రమే ఉంది. ఈ నెల రోజుల్లో మద్య నిషేధం చేసి ఓట్లడుగుతారా? లేక తాను చెప్పిన మాట ప్రకారం చేయలేదు కాబట్టి ఓట్లు అడగరా అనేది సరిగ్గా నెల రోజుల్లో తేలుతుంది.

అమ్మకాలే లక్ష్యంగా అడుగులు

నాలుగున్నరేళ్లుగా దశలవారీగా అంటూ నాలుక మడతేసిన నిషేధంపై మాట తప్పి, మడమ తిప్పారు. మద్య నిషేదం మాటేమో గానీ, టార్గెట్లు పెట్టి మరీ మందుబాబులను తాగించే పనిలో పడ్డారు. టార్గెట్లు తగ్గినప్పుడల్లా కొత్తకొత్త స్కీములతో మందుబాబులను ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. మద్యం అమ్మకాలు భారీగా పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అమ్మకాలు తగ్గినప్పుడల్లా ధరలు తగ్గించి మందుబాబులు మద్యం షాపులకు దూరమవ్వకుండా జాగ్రత్త పడుతోంది. ముట్టుకుంటే షాక్ కొట్టేలా మద్యం రేట్లు పెంచి మందుబాబులను అలవాటుకు దూరం చేస్తామని చెప్పిన ప్రభుత్వం గడిచిన నాలుగున్నరేళ్లలో ఐదుసార్లు ధరలు తగ్గించింది. తాజాగా కిందటేడాది నవంబరు 18న ఒకసారి డిసెంబరు 29న మరోసారి మద్యం ధరలు తగ్గించింది. దీనికితోడు మద్యం దుకాణాలు తెరిచి ఉంచే సమయాన్ని ఏడాదికి ఒక గంట చొప్పున పెంచుతూ వస్తోంది. అయినప్పటికీ సంతృప్తి చెందని ప్రభుత్వం మందుబాబులను తిరిగి మద్యం దుకాణాలవైపు మళ్లించడానికి పాత బ్రాండ్ల నాటకాన్ని మొదలు పెట్టింది.

షాపుల్లో కొత్త బ్రాండ్లే..

గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలో పాత బ్రాండ్ల హడావుడి మొదలై వారం రోజులకు పైగా అవుతోంది. మద్యం దుకాణాల్లో కూడా సేల్స్ బాయ్స్, సూపర్‌వైజర్లు పాత బ్రాండ్లపై ఊదరగొట్టారు. కొత్త బ్రాండ్లకు భయపడి మద్యం దుకాణాలకు దూరమైన మందుబాబులను తిరిగి రప్పించుకోవడానికి ప్రభుత్వం పాత బ్రాండ్ల పేరుతో ప్రచారం చేయిస్తోందన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఆ విమర్శలకు బలం చేకూరేలా పాత బ్రాండ్లను అడపాదడపా మాత్రమే సరఫరా చేస్తూ నాసిరకం కొత్త బ్రాండ్లనే ప్రభుత్వం మందుబాబులకు అంటగడుతున్నారు. పాత బ్రాండ్లు వస్తాయని ఆశపడిన మందుబాబులు కొందరు వాటి కోసం ప్రయత్నించి నిరాశ పడుతున్నారు. ఎప్పటిలాగే నాసిరకం కొత్త బ్రాండ్లతో సరిపుచ్చుకుంటున్నారు. వారం పది రోజులుగా పాత బ్రాండ్లపై హడావుడి కనిపిస్తున్నా తమకు అందుబాటులోకి రాకపోవడంతో మందుబాబులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం పాత బ్రాండ్లు అందుబాటులోకి తెస్తోంది తమ కోసమా? లేక ఎన్నికలలో పంపిణీ కోసమా అని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పాత బ్రాండ్లని మద్యం దుకాణాలకు చేరకుండానే వాటిని అధికారపార్టీ నేతలు మాయం చేస్తున్నారేమోనన్న సందేహం కలుగుతోంది. ఎన్నికల్లో నాసిరకం మద్యం పంపిణీ చేస్తే ఫలితం ఉండదని భావించి ప్రభుత్వమే ఇలా అడ్డదారులు తొక్కుతోందేమోనని వారు భావిస్తున్నారు. మద్యం దుకాణాల్లో కొత్త బ్రాండ్లు తప్ప పాత బ్రాండ్లు లేకపోవడంతో వారి అనుమానాలకు బలం చేకూరుతోంది.

కాంట్రాక్టర్లు..కుమ్మక్కు?

- కోటయ్యకు తగ్గిన తలనీలాల ఆదాయం
- గత ఏడాది కంటే రూ.19.32 లక్షల తక్కువకు టెండర్



నరసరావుపేట, ఫిబ్రవరి 28: కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో తలనీలాల సేకరణకు సంబంధించిన నిర్వహించిన టెండర్లలో కాంట్రాక్టర్లు కుమ్మక్కైయ్యారు. గత ఏడాది కంటే రూ.19.32 లక్షల తక్కువకు టెండర్ దాఖలైంది. దీంతో కోటయ్యస్వామికి తలనీలాల ఆదాయం తగ్గిపోయింది. ఈ ఏడాదికి సంబంధించి రూ.25.18 లక్షలకు టెండర్ దాఖలైందని ఆలయ అధికారులు బుధవారం తెలిపారు. గత ఏడాది రూ.44.50 లక్షలకు టెండర్ దాఖలు కాగా ఈ ఏడాది రూ.19.32 లక్షలకు తగ్గడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా ఏటా తలనీలాల ఆదాయం పెరగాల్సి ఉండగా తగ్గడం వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉందన్న ఆరోపణలున్నాయి. కాంట్రాక్టర్లు కుమ్మక్కై ఉంటారన్న ఆరోపణలున్నాయి. అయితే ప్రముఖ ఆలయాల్లో కూడా తలనీలాల ఆదాయం తగ్గిందన్న వాదనను కార్యాలయ వర్గాలు వినిపిస్తున్నాయి. కోటప్పకొండ టెండర్ ఆమోదం కోసం దేవదాయశాఖ కమిషనర్‌కు అధికారులు లేఖ పంపారు. కమిషనర్ నిర్ణయం మేరకు టెండర్ ఆమోదం ఆధారపడి ఉంది. కమిషనర్ అనుమతి ఇవ్వకపోతే టెండర్‌ను రద్దు చేస్తామని అధికారులు తెలిపారు. ఆదాయం పెంచేందుకు అధికారులు కృషి చేస్తారా లేక తక్కువకు టెండర్ ఆమోదిస్తారో చూడాలి. అయితే టెండర్ ఆమోదం కోసం అధికారులపై అధికార పార్టీ నేతలు ఒత్తిడి తెస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది.

బూత్‌ల క్రమబద్ధీకరణకు చర్యలు

స్వేచ్ఛగా ఓటు వేసేందుకు ఏర్పాట్లు ● రాజకీయపార్టీల సమావేశంలో కలెక్టర్

బాపట్ల, ఫిబ్రవరి 28: జిల్లాలో పోలింగ్ బూత్‌ల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. రాజకీయపార్టీల నాయకులతో బుధవారం కలెక్టరేట్‌లో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పోలింగ్ బూత్‌ల పేర్లు తప్పుగా నమోదైన వాటిని సరిచేశామన్నారు. అసంపూర్తి, శిథిలావస్థకు చేరిన భవనాల్లోని



రాజకీయపార్టీల నాయకులతో సమావేశమై మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

పోలింగ్ బూత్‌లను మార్పు చేసినట్లుగా చెప్పారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. పెండింగ్‌లో ఉన్న వివిధ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. ఎన్నికల ప్రకటన త్వరలోనే జారీ అయ్యే అవకాశం ఉన్నందున మోడల్‌కోడ్ ఆఫ్ కండక్ట్, మీడియా సర్టిఫికేషన్, మానిటరింగ్ కమిటీలపై రాజకీయపార్టీ ప్రతినిధులకు అవగాహన కల్పిస్తామన్నారు. సమావేశంలో డీఆర్వో సత్తిబాబు, ఆర్డీవో హేలా షారోను, వైసీపీ, టీడీపీ, బీజేపీ, సీపీఎం నాయకులు ఇనగలూరి మాల్యాద్రి, షేక్.మహ్మద్‌గౌస్‌బాషా, రామకృష్ణ, ఎన్.కోటేశ్వరరావు, బీఎస్పీ, ఆమ్‌ఆద్మీపార్టీ జిల్లా అధ్యక్షులు కాగిత కోటేశ్వరావు, ఆట్ల బాలాజిరెడి పాల్గొన్నారు.

నిబంధనల మేరకు బాధ్యతలు నిర్వహించాలి


రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకు మీడియా సర్టిఫికేషన్ మరియు మానిటరింగ్‌కమిటీ(ఎంసీఎంసీ) కమిటీ తగు బాధ్యతలు నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎంసీఎంసీ సభ్యులతో జరిగిన సమావేశం జరిగింది. ఎన్నికలలో కమిటీ పాటించాల్సిన విధివిధానాలపై చర్చించారు. సమావేశంలో డీఆర్వో సత్తిబాబు, జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ, కేంద్రప్రభుత్వ క్షేత్ర ప్రచార అధికారి రమేష్‌చంద్ర, సమాచారశాఖ సహాయసంచాలకులు సుభాషిణి పాల్గొన్నారు.

బరిలోకి దిగకుండానే..
రమణ వాకౌట్

- గుంటూరు నుంచి పోటీకి ఎంపీ అభ్యర్థి వెనుకంజ
- బావమరిదికి బదులు బరిలోకి రోశయ్యకు అవకాశం
- పొన్నూరు నుంచి లోక్‌సభకు ఎమ్మెల్యే కిలారి వలస
- పొన్నూరు తెరపైకి మంత్రి అంబటి సోదరుడు మురళీకృష్ణ



మురళీకృష్ణ



రోశయ్య

గుంటూరు(ఆంధ్రజ్యోతి), పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 28: టీడీపీ, జనసేన పొత్తు ఖరారు.. ఆ పార్టీ అధినేతలు ఉమ్మడిగా ఎన్నికలకు శంఖారావటం పూరించటంతో వైసీపీలో వణుకు మొదలైందా.. అంటే జరుగుతున్న పరిణామా లు అవును అన్నట్లుగా ఉన్నాయి. అభ్యర్థుల ఎంపిక ఇప్పటికే పూర్తయింది.. ఇక మార్పులు, చేర్పులు ఒకటి రెండు మినహా ఉండవని సీఎం జగన్ ప్రకటించిన గంటల వ్యవధిలోనే గుంటూరు లోక్‌సభ పరిధిలోనే ఇద్దరిని మార్చేశారు. గుంటూరు ఎంపీ అభ్యర్థిగా ఇప్పటికే ఖరారైన ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి తనయుడు వెంకటరమణ ఇంకా బరిలోకి దిగక ముందే ఓటమి భయంతో పోటీ నుంచి తప్పుకున్నారు. విజయావకాశాలు ఏ మాత్రం లేని గుంటూరు లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి ఓటమిని మూటకట్టుకోవటమే కాకుండా రూ.కోట్లు వ్యయం చేసుకోవడం అవుతుందని ఆయ న భావించారని సమాచారం. తనను పోటీ నుంచి తప్పించమని అధిష్ఠానానికి మొర పెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన్ను తప్పించి ఆ స్థానంలో ఆయన బావ పొన్నూరు ఎమ్మెల్యే రోశయ్యను బరిలోకి దించారు. విశేషమేమిటంటే పొన్నూరులో విపరీతమైన అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ స్వపక్షం సైతం వ్యతిరేకించిన రోశయ్యకు పదోన్నతి కల్పించి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించడంపై ఆ పార్టీలోనే నిరసన వ్యక్తమవుతుంది.

కిలారికి పదోన్నతి..

వెంకటరమణ బరిలోకి దిగకుండానే వాకౌట్ చేయడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆయన బావ పొన్నూరు ఎమ్మెల్యే రోశయ్యను గుంటూరుఎంపీ అభ్యర్థిగా బరిలోకి దించుతున్నట్లు వైసీపీ అధిష్ఠానం బుధవారం ప్రకటించింది. గత ఎన్నికల్లో వైసీపీ గాలిలో తొలిసారి చట్టసభలోకి అడుగుపెట్టిన రోశయ్య స్వపక్షం నుంచే తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకున్నారు. ఆయనకు టికెట్ ఇస్తే ఓడిస్తామని సొంత పార్టీ నాయకులు రోడ్డెక్కి నిరసనలు తెలిపారు. అంతేగాక తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లి పార్టీ పెద్దలకు వినతిపత్రాలు కూడా అందజేశారు. ఈ నేపథ్యంలో రోశయ్య తిరిగి గెలిచే అవకాశాలు ఏ మాత్రం లేవని అధిష్ఠానం భావించింది. అయితే ఉమ్మారెడ్డిపై గౌరవంతో ఇప్పటి వరకు రోశయ్యను కదిలిం చలేదు. అయితే నెల రోజుల క్రితం ఉమ్మారెడ్డి తనయుడు వెంకటరమణను గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలో దించారు. అయితే ఆయన ఇంత వరకు కార్యరంగంలోకి దిగకుండానే పరార య్యారు.

రోశయ్య స్థానంలో మురళీకృష్ణ

రోశయ్య స్థానంలో పొన్నూరు వైసీపీ అభ్యర్థిగా మంత్రి రాంబాబు సోదరుడు బిల్డర్ అంబటి మురళీకృష్ణను బరిలోకి దించారు. మురళీకృష్ణ కుటుంబం మూలాలు పొన్నూరు మండలం మామిళ్లపల్లిలో ఉన్నప్పటికీ వారు రేపల్లె వలస వెళ్లి అక్కడే స్థిరపడ్డారు. అయితే పొన్నూరు సీటును ఆశిస్తున్న మురళీకృష్ణ ఏడాది కాలంగా మామిళ్లపల్లిలో స్థిరనివాసం ఏర్పరుచుకున్నారు. భజరంగ్ ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నారు. అయితే మురళీకృష్ణ నియామకంపై వైసీపీ లోనే భిన్నాభిప్రాయం వ్యక్తమవుతుంది.

2న గురజాలలో..
రా కదలిరా

- సభలో శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం
- నేడు వేదికను ఖరారు చేయనున్న నేతలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 28: టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు రా కదలిరా.. బహిరంగ సభ మార్చి 2 శనివారం గురజాలలో ఏర్పాటు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీని వాసరావు బుధవారం తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు గురజాలలో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలి పారు. సభా ప్రాంగణం ఎక్కడ అనేది గురువారం టీడీపీ, జనసేన నాయకులతో కలిసి నిర్ణయిస్తామన్నారు. తొలుత మార్చి 2, 3 తేదీల్లో నరసరావుపేటలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని పార్టీ భావించింది. అయితే నరసరావుపేటలో జరగాల్సిన సభను శనివారం గురజాలలో నిర్వహించేందుకు పార్టీ పెద్దలు నిర్ణయించారు. ఈ బహిరంగ సభ ద్వారా పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశా నిర్దేశం చేయనున్నారు.



టీడీపీ హయాంలో..
- బియ్యం
- పంచదార , కందిపప్పు
- గోధుమలు/గోధుమ పిండి
- పామాయిల్, రాగులు/జొన్నలు/సజ్జలు

వైసీపీ పాలనలో..
- కేంద్రం ఇచ్చే బియ్యం
- అరకేజీ పంచదార (మార్కెట్ ధరతో సమానం)
- అరకొరగా కందిపప్పు

బియ్యం,చక్కెరతో.. సరి


- చతికిల పడిన సరుకుల పంపిణీ
- రేషన్ సబ్సిడీ నిధులను దారి మళ్లించి కోత
- సన్నబియ్యంతో నిత్యావసరాలు ఇస్తామని ప్రగల్బాలు
- కేంద్రం ఇచ్చే బియ్యం, అరకేజీ పంచదార మాత్రమే సరఫరా
- బహిరంగ మార్కెట్లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నా పట్టని వైనం

చెప్పేది పెద్దపెద్ద మాటలు.. చేతల్లోకి వచ్చే సరికి అరకొరగానే అమలు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ సరుకుల పంపిణీకి ఇది సరిగ్గా సరిపోతోంది. గత ప్రభుత్వ హయాంలో రేషన్ డిపోల ద్వారా కార్డుదారులకు బియ్యం, పంచ దార, కంది పప్పు, గోధుమలు/గోధుమ పిండి, పామాయిల్, రాగులు/జొన్నలు/సజ్జలు వంటివి ఇచ్చే వ్యవస్థ ఉండేది. అయితే తాను అధికారంలోకి వస్తే ఆ సరుకులన్నీ కూడా డోర్ డెలివరీ చేస్తానని వైసీపీ అధినేత ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పేదలకు ఇచ్చి వాటితోనే బతకమని చెబుతున్నారు. వీటిలో కూడా కేంద్రం బియ్యం ఇస్తుండగా.. మార్కెట్ ధరతో సమా నంగా ఉన్న అర కేజీ పంచదార కార్డుదారులకు అంద చేస్తున్నారు. ఈ రెండు సరుకుల కోసం ఎండీయూ వాహనం.. దానికో సైరన్.. డ్రైవర్ ఒకరు.. మరొక సహాయకుడు.. వీధుల్లో ఆ వాహ నం వద్ద కార్డు దారుల బారులు.. ఇదీ ప్రస్తుతం రేషన్ పంపిణీ తీరు. దీనిపై అటు ప్రతి పక్షాలు, ఇటు కార్డుదారులు అసహనం వ్యక్తం చేస్తున్నా తాము పేదల కోసమే ఉన్నామని వైసీపీ పాలకులు ప్రగల్బాలు పలుకుతున్నారు.

రేషన్ సరుకులకు గండి

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): తాను అధికారంలోకి సన్న బియ్యంతో పాటు నిత్యా వసర సరుకులను పేదలకు డోర్ డెలివరీ చేస్తానని వైసీపీ అధినేత జగన్ ఎన్నికల ప్రచారంలో ప్రకటించారు. అయితే అధికా రంలోకి వచ్చిన నాలుగు సంవత్సరాల 9 నెలల నుంచి కేవలం బియ్యం, చక్కెర మాత్రమే పేదలకు ఇచ్చి వాటితోనే బతకమని చెబుతున్నారు. పేదల గురించి తరచుగా మాట్లాడే సీఎం జగన్ వారికి ప్రతీ నెలా ఇవ్వాల్సిన రేషన్ సరుకుల వద్దకు వచ్చేసరికి నాలిక మడత పెడుతు న్నారు. ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరగబోతోన్నాయని పెద్దపెద్ద మా టలు చెబుతూ పేదలకు హక్కుగా రావా ల్సిన రేషన్ సరుకులకు గండి కొడుతు న్నారు. రేషన్ సబ్సిడీ నిధులను దారి మళ్లించడంతో సరుకులకు కోత పడు తుంది. తప్పనిసరి పరిస్థితుల్లో కేంద్రం నుంచి వస్తున్న బియ్యాన్ని మాత్రం నెల నెలా కార్డుదారులకు ఇస్తున్నారు. ఇక ఆ ఒక్కదానితో సరిపెడితే బాగుండదేమోనని మార్కెట్ ధరతో సమానంగా ఉన్న అరకేజీ పంచదారను అందచేస్తున్నారు. ప్రభుత్వం గత టీడీపీ, కాంగ్రెస్ ప్రభు త్వాల హయాంలో ప్రతీ కుటుంబానికి క్రమం తప్పకుండా రేషన్ సరుకులు అందేవి. వాటికి అదనంగా నెలలో మరి కొన్ని సరుకులు బయట తీసుకుంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా పేదలకు భోజన అవ సరాలు తీరిపోయేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. తాను అధికారంలోకి వస్తే 5,10,15, 20, 25 కేజీల బస్తాల రూపంలో వలంటీర్లు ఇంటికి తీసుకొచ్చి ఇస్తారని వాగ్దానం చేశారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. కేవలం బియ్యం, చక్కెర మాత్రమే ఎండీయూ ఆపరేటర్ల ద్వారా పంపిణీ చేస్తున్నారు. కందిపప్పు ఒక నెల ఇస్తే మళ్లీ ఎప్పుడు ఇస్తారో, లేదో తెలియని పరిస్థితి. అది కూడా అందరికీ కాకుండా కేవలం కొందరికి మా త్రమే అందుతుంది. ఎవరైనా కార్డుదారు లు కందిపప్పు కావాలని అడిగినా లేదనే సమాధానం ప్రతీ నెల ఎండీయూ వాహనదారుల నుంచి వస్తుంది. గోధుమ పిండి ప్యాకెట్లు అరకొరగా ఇస్తున్నా అవి కొద్ది రోజులకే పురుగు పడుతున్నాయి. దీంతో వినియోగదారులు వాటిని తీసుకోవడం లేదు. పామాయిల్ అసలే ఇవ్వడం లేదు. బియ్యానికి బదులుగా రాగులు/జొన్నలు /సజ్జలు ఇచ్చేవారు. వాటికి కూడా వైసీపీ ప్రభుత్వం శుభంకార్డు వేసింది. ఇలా పేదలకు రేషన్ సరుకుల్లో కోత పెట్టి సబ్సిడీ రూపంలో భరించాల్సిన నిధులను దారి మళ్లిస్తుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమౌతున్నాయి.

పేదలపై ఆర్థిక భారం



టీడీపీ హయాంలో పంపిణీ చేసిన నిత్యావసరాలు (పాతచిత్రం)

వైసీపీ పాలనలో రేషన్ సరుకుల పంపిణీ పూర్తిగా చతికల పడిందని కార్డుదారులు విమర్శిస్తున్నారు. ఒక వైపు బహిరంగ మార్కెట్‌లో కందిపప్పు, నూనెలు, ఇతర నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటుతున్నా నియంత్రణకు చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించడంలేదు. గత ప్రభుత్వాల హయాంలో మార్కెట్‌లో ధరల పెరుగుదలను అడ్డుకునేందుకు రేషన్ ద్వారా ఆయా సరుకులను అందజేసే వారు. దీంతో బహిరంగ్ మార్కెట్‌లో ఆయా సరుకులకు డిమాండ్ తగ్గి ధరలు అందుబాటులోకి వచ్చేవి. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ దిశగా ప్రభుత్వం ఆలోచనే చేయడం లేదు. దీంతో నిత్యావసరాల ధరలు సామాన్యులకే కాదు మధ్య తరగతివర్గాలకు కూడా అందుబాటులో ఉండటం లేదు. ప్రభుత్వ తీరుతో ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతుంది. మరో వైపు రేషన్ పంపిణీ వ్యవస్థతో పెద్దగా ప్రయోజనం చేకూరడంలేదు. కిలో కంది పప్పు రకాలను బట్టి రూ.160 నుంచి రూ.200 వరకు పలుకుతుంది. రేషన్ డిపోల ద్వారా సరఫరా చేస్తే పేదలపై ఆర్థిక భారం తగ్గేది. టీడీపీ పాలనలో ప్రతి నెల కిలో కందిపప్పు రూ.40కి సరఫరా చేసేది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ ధరను రూ.67కు పెంచింది. అయినా అందరికీ కందిపప్పును సక్రమంగా ఇవ్వడం లేదు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కిలో పంచదార రూ.14కు ఇచ్చేవారు. జగన్ దానిని అరకిలోకు పరిమితం చేశారు. పైగా ధరను మార్కెట్ ధరతో సమానంగా పెంచేశారు. నాడు రాగులు, జొన్నలు వంటివి కూడా రాయితీపై కార్డుదారులకు ఇచ్చేవారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తదితర పండుగ ల సమయంలో ఆయా వర్గాలకు ప్రత్యేకంగా ఉచితంగా కానుకలు అందజేసి పేదలను ఆదుకునే వారు. అయితే పేదలకు ఎంతో చేస్తున్నామని చెపుతున్న జగన్ పండుగ కానుకలను రద్దు చేశారు. రేషన్ సరుకుల పంపిణీకి ఎండీయూ వాహనాలను లక్షలు ఖర్చు పెట్టి కొనుగోలు చేశారు. ఒక్కొక్క వాహన దారుడికి నెలకు రూ.21 వేలు చొప్పున చెల్లిస్తున్నారు. ఇంత ఖర్చు చేసి కేవలం పంచదార, బియ్యం ఇవ్వడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

పోస్టుమాస్టర్ చేతివాటం

- ఖాతాదారులకు రూ.20 లక్షల కుచ్చుటోపీ

చుండూరు, ఫిబ్రవరి 28: ఓ పోస్టుమాస్టర్ చేతివాటంతో రూ.20 లక్షలు మాయం చేసిన ఘటన మండల పరిధిలోని మోదుకూరులో ఆలస్యంగా వెలుగుచూసింది. ఖాతాల్లో నగదు లేకపోవడంతో ఖాతాదారులు లబోదిబోమంటూ ఆందోళనకు దిగారు. ఇందుకు సంబంధించి బాధితులు తెలిపిన వివరాలు.. మోదుకూరు బ్రాంచి పోస్టాఫీసులో గత ఏడాది మే నుంచి కేదార్‌నాథ్‌గౌడ్ పోస్టుమాస్టర్‌గా పని చేస్తున్నాడు. ఖాతాదారులతో నమ్మకంగా ఉంటూ వారి అర్జీలు, డిపాజిట్ల పుస్తకాలను తన వద్దే ఉంచుకున్నాడు. వారిచ్చిన నగదును పుస్తకాల్లో ఎంట్రీలు వేయకుండా కేవలం తెల్ల కాగితాలపై సంతకం పెట్టి ఇచ్చేవాడు. ఖాతాపుస్తకాలు ప్రింట్ అయిన తర్వాత ఇస్తానని నమ్మించాడు. లక్షల రూపాయలు డిపాజిట్ చేసినా ఇదేవిధంగా చేసేవాడు. కేంద్ర ప్రభుత్వం నుంచి డబ్బులు వస్తాయని చెప్పి వారిచేత వేలిముద్రలు, సంతకాలు తీసుకుని, వారికి తెలియకుండానే నగదును డ్రా చేసుకోవడం ప్రారంభించాడు. దీనిని గుర్తించిన తాళ్ళ సామ్రాజ్యం, ఎ.భూలక్ష్మి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన అధికారులు నగదు లావాదేవీల్లో పెద్ద ఎత్తున అవకతవలు జరిగాయని గుర్తించారు. దీనిపై పోస్టల్ డిపార్టుమెంట్ సూపరింటెండెంట్ శాంతి రవికిషోర్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా కేదార్‌నాథ్ గౌడ్‌ను సస్పెండ్ చేశామన్నారు. నెల రోజుల్లో విచారణ పూర్తి అవుతుందని తెలిపారు.



పోస్టాఫీసు వద్ద నిరసన తెలుపుతున్న మహిళలు

మూడు హిస్టారికల్ వెబ్ సిరీస్‌లు



సినిమాల్లో వాణిజ్య అంశాలతో పాటు సామాజిక ప్రయోజనం కూడా ఉండాలని నమ్మే దర్శకుల్లో ఎన్.శంకర్ ఒకరు. పలు విభిన్న చిత్రాలు రూపొందించిన ఆయన తాజాగా చారిత్రక నేపథ్యంలో మూడు వెబ్ సిరీస్‌లు తీయడానికి సంకల్పించారు. బుధవారం వాటి విశేషాలు వెల్లడిస్తూ 'తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ ప్రాంతం ఇండియన్ యూనియన్‌లో కలవడం, ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడడం, ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం జరిగిన పోరాట నేపథ్యం, తెలంగాణ రాష్ట్రం ఏర్పడేంతవరకూ ఉద్యమాల్లో జరిగిన ఆటుపోట్లు... తదితర అంశాలను ప్రజల కోణంలో చూపించాలని మా ప్రయత్నం. అక్టోబర్ నుంచి షూటింగ్‌కు శ్రీకారం చుడతాం' అని చెప్పారు. అలాగే జ్యోతీరావు పూలే అనుభవాలు, అవమానాలు కథాంశంగా మరో వెబ్ సిరీస్‌ను, అదే విధంగా బాబా సాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ స్ఫూర్తి ఇతివృతంగా ఇంకో వెబ్ సిరీస్ నిర్మిస్తామని ఆయన చెప్పారు. జ్యోతిరావు పూలే, అంబేద్కర్ వెబ్ సిరీస్‌లు వారి బయోగ్రఫీలు కాదని శంకర్ స్పష్టం చేశారు. తెలుగు, హిందీ భాషల్లో ఈ మూడు వెబ్ సిరీస్‌లు నిర్మిస్తామనీ, మూడేళ్ల నుంచి తన టీమ్‌తో కలసి కథలపై వర్క్ చేస్తున్నామని తెలిపారు.

రాజుగారి అమ్మాయితో నాయుడుగారి అబ్బాయి



రవితేజ నున్నా, నేహా జురెల్ జంటగా నటించిన 'రాజుగారి అమ్మాయి- నాయుడుగారి అబ్బాయి' చిత్రం ట్రైలర్‌ను బుధవారం దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'అందరికీ కనెక్ట్ అయ్యే టైటిల్‌తో విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో రూపొందిన చిత్రం ఇది. సినిమా విజయం సాధించాలి' అని కోరారు. నిర్మాతల్లో ఒకరైన ముత్యాల రామదాసు మాట్లాడుతూ 'చిన్న సినిమాలు కూడా పెద్ద విజయం సాధిస్తున్నాయి. దర్శకుడు సత్యరాజ్‌కు మంచి విజన్ ఉంది. ఎన్నో సమస్యలు ఎదురైనా ఎక్కడా రాజీపడకుండా తీసిన సినిమా ఇది. మార్చి 9న విడుదల చేస్తున్నాం. సినిమాలో హీరోగా నటించిన కొత్త నటుడు రవి తేజ పెద్ద హీరోగా ఎదగాలి' అన్నారు. 'ముత్యాల రామదాసు గారు మా వెనుక ఉండి ఈ సినిమాను విజయవంతంగా పూర్తి చేయించారు. మా అమ్మ నున్నా కుమారిగారు లేకపోతే ఈ ప్రాజెక్ట్ కంప్లీట్ అవదు. ఈ సినిమా కోసం ఎంతో కష్టపడ్డాం. అందరినీ ఆకట్టుకొనే చిత్రం అవుతుంది' అన్నారు రవితేజ. ఈ చిత్రనిర్మాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ దర్శకుడు సత్యరాజ్ కృతజ్ఞతలు తెలిపారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/NwRzjye లో చదవండి.

ప్రేక్షకులు గర్వపడేలా ఆపరేషన్ వాలెంటైన్



వరుణ్‌తేజ్, మానుషి చిల్లర్ జంటగా నటించిన 'ఆపరేషన్ వాలెంటైన్' మార్చి ఒకటిన విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాతలు సిద్దు ముద్దా, నందకుమార్ అబ్బినేని బుధవారం మీడియాతో మాట్లాడారు

● దర్శకుడు శక్తి ప్రతాప్‌సింగ్ రూపొందించిన షార్ట్ ఫిల్మ్ మాకు, వరుణ్‌కి బాగా నచ్చింది. దాన్నే ఫుల్ లెంగ్త్ ఫీచర్ ఫిల్మ్‌గా చేయాలనే ప్రయత్నాల్లో దర్శకుడు ఉన్నప్పుడు ఆ కథ విన్నాం. బాగా నచ్చడంతో సినిమా తీయాలని నిర్ణయించుకున్నాం. సోనీ పిక్చర్స్ నిర్మాణ భాగస్వామిగా రావడంతో తెలుగు, హిందీ భాషల్లో గ్రాండ్‌గా తీశాం.

● కొత్త వాడైనా ప్రతాప్ సింగ్‌కు మంచి క్లారిటీ ఉంది. సినిమాకు ఏం కావాలో ఆయనకు స్పష్టంగా తెలుసు. అలాగే తను అదే నేపథ్యం నుంచి వచ్చారు కనుక వీఎఫ్ఎక్స్ మీద మంచి కమాండ్ ఉంది. 'ఫైటర్' తర్వాత ఇలాంటి భారీ ఎయిర్ సీక్వెన్స్‌తో ఇండియాలో వచ్చిన మా చిత్రాన్ని ఆయన చాలా అద్భుతంగా తీశారు. గ్వాలియర్ ఎయిర్ బేస్‌లో సినిమాను షూట్ చేశాం. రియల్ ఎయిర్ బేస్‌లో షూటింగ్ చేయడం ఒక కొత్త అనుభూతి. వాయు సేన సైనికుల త్యాగాలను, ధైర్యాలను స్మరించుకుంటూ వాళ్ల కథని ప్రేక్షకులకు చెప్పాలనే ఆలోచనతో ఈ సినిమా నిర్మించాం.

'హాఫ్ లయన్'గా పీవీ బయోపిక్



ఆహా స్టూడియో, అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంయుక్తంగా భారతరత్న పురస్కార గ్రహీత, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జీవిత ప్రస్థానాన్ని బయోపిక్ రూపంలో తెర మీదకు తీసుకురావడానికి సిద్ధమయ్యాయి. ఈ ప్రతిష్ఠాత్మక బయోపిక్‌ను 'హాఫ్ లయన్' పేరిట వెబ్ సిరీస్‌గా రూపొందిస్తున్నారు. ప్రముఖ రచయిత వినయ్ సీతాపతి రచించిన 'హాఫ్ లయన్' పుస్తకం ఆధారంగా జాతీయ అవార్డు గ్రహీత, నటుడు ప్రకాష్ ఝా ఈ సిరీస్‌ను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పాన్ ఇండియన్ సిరీస్ ప్రీ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ఈ సిరీస్‌ను విడుదల చేయబోతున్నారు. పీవీ నరసింహారావు జీవితంలోని కీలక మైలురాళ్లను ఈ సిరీస్ హైలైట్ చేయనుంది.

అందరినీ మెప్పిస్తుందనే నమ్మకం ఉంది




శివ కందుకూరి హీరోగా రూపొందిన క్రైమ్‌థ్రిల్లర్ 'భూతద్దం భాస్కర్ నారాయణ'. పురుషోత్తం రాజ్ దర్శకత్వంలో స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించారు. రాశి సింగ్ కథానాయిక. మార్చి 1న ఈచిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ ట్రైలర్ ఈవెంట్‌ను చిత్రబృందం నిర్వహించింది. శివ కందుకురి మాట్లాడుతూ "భూతద్ధం...'ప్రచార చిత్రాలకు ప్రేక్షకుల నుంచి అద్భుత స్పందన వచ్చింది. సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది. గీతా డిస్ట్రిబ్యూషన్ విడుదల వల్ల సినిమా మరింత మంది ప్రేక్షకులకు చేరువవుతుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఈ సినిమాతో దర్శకుడిగా నా కల నెరవేరింది. శ్రీ చరణ్ అద్భుతమైన మ్యూజిక్ ఇచ్చారు. శివ లాంటి హీరో దొరికినందుకు ఆనందంగా ఉంది. సినిమా చాలా బాగా వచ్చింది. ఆదరించండి' అని ప్రేక్షకులను కోరారు.

నాయర్ నా భర్తే : మలయాళ నటి హర్షం



'గగన్‌యాన్'కు సంబంధించి ఎంపికైన నలుగురు వ్యోమగాముల్లో ప్రశాంత్ నాయర్ ఒకరు. వ్యోమగామిగా ఈయనను ఎంపిక చేస్తూ ప్రధాని మోదీ ప్రకటించిన తర్వాత మలయాళ సినీ నటి, స్నేహం సినిమాలో నటించిన లీనా సంతోషంతో ఉక్కిరిబిక్కిరికి గురయ్యారు. "నాయర్ నా భర్తే, మాకు గత నెల 17న వివాహం జరిగింది. మాది పెద్దలు కుదిర్చిన వివాహం. నాయర్‌ను వ్యోమగామిగా ప్రకటించిన సందర్భం నా జీవితంలో మరువలేనిది. ఇదొక చరిత్రాత్మక ఘట్టం. ఈ దేశానికి, మా రాష్ట్రానికి(కేరళ), వ్యక్తిగతంగా నాకు ఎంతో గర్వకారణం" అని ఆమె పేర్కొన్నారు.

దిక్సూచి DIKSUCHI



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం


నదీ జలాల వివాదాలు

అల్మట్టి వివాదం

- కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి నుంచి ఈ వివాదం ఉంది.
- దీనికి సంబంధించిన ట్రిబ్యునల్స్: బచావత్ ట్రిబ్యునల్, బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్
- అల్మట్టి డ్యాం వాస్తవ ఎత్తు: 517 మీటర్లు
- ఎత్తు పెంచడంలో భాగంగా కర్ణాటక ప్రతిపాదించిన ఎత్తు: 524. 25 మీటర్లు
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన ఎత్తు: 519.6 మీటర్లు

కృష్ణా నది జలాల వివాదం (బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్)

- 1969 ఏప్రిల్ 10: బచావత్ ట్రిబ్యూనల్ ఏర్పాటు (ఇంటర్ స్టేట్ వాటర్ డిస్ప్యూట్స్ యాక్ట్-1956 ప్రకారం)



ఇండియన్ జాగ్రఫీ

- ఇది 1973లో తుది తీర్పు ఇచ్చింది. దీనిలో స్కీమ్-ఎ లో నికర జలాలు, స్కీమ్-బి లో మిగులు జలాలను పంపిణీ చేసింది. కృష్ణా నదిలో లభించే మొత్తం నీటిలో 75 శాతం నికర నీటి లభ్యతగా గుర్తించి పంచింది.
- 1976 మే 31: ప్రభుత్వం బచావత్ ట్రిబ్యునల్ తుది తీర్పు గెజిట్‌ను ప్రకటించింది.

దీని ప్రకారం కృష్ణా నదిలో నికర జలాల లభ్యత 2060 టీఎంసీలుగా పేర్కొంది.

- మహారాష్ట్ర - 560, కర్ణాటక-700, ఆంధ్రప్రదేశ్ 800 టీఎంసీల నీటి వాటా కలిగి ఉన్నాయి.

నోట్: మిగులు జలాలు అంటే...ప్రాజెక్టులలోని నీటిని కాలువల ద్వారా పొలాలకు మళ్లించి సాగునీటికి, వివిధ అవసరాలకు ఉపయోగించగా, మిగిలిపోయి తిరిగి నదిలో కలిసే జలాలు.

- ట్రిబ్యునల్ 70 టీఎంసీలను మిగులు జలాలుగా పేర్కొని, మహారాష్ట్రకు-25, కర్ణాటకకు-45, ఆంధ్రప్రదేశ్‌కు-11 టీఎంసీలు కేటాయించింది.
- 2004 ఏప్రిల్ 2: బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. 2006 ఫిబ్రవరి 1 నుంచి ట్రిబ్యునల్ అధికారికంగా అమలులోకి వచ్చింది. 2010 డిసెంబరు 31న కర్ణాటకకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అదేవిధంగా మిగులు జలాల వాటాను ఆంధ్రప్రదేశ్‌తోపాటు కర్ణాటక, మహారాష్ట్రకు పంచింది. కృష్ణానది నికర నీటి లభ్యతను 2594 టీఎంసీలుగా లెక్కించింది(మిగులు జలాలను కూడా కలిపింది). మహారాష్ట్రకు-666 టీఎంసీలు, కర్ణాటకకు-911 టీఎంసీలు, నది పరిరక్షణ కోసం-16 టీఎంసీలు, ఆంధ్రప్రదేశ్‌కు-1001 టీఎంసీలు కేటాయించింది.

నోట్: తదుపరి నది జలాల పునఃసమీక్ష 2050 తర్వాతే ఉంటుందని రిపోర్ట్ పేర్కొంది.

కావేరీ నది జలాల వివాదం

కావేరీ నది నీటిని తమిళనాడు గ్రాండ్ ఆనకట్ట (కళ్లనై డ్యామ్)ను రెండవ శతాబ్దంలో నిర్మించడం ద్వారా, 1934లో నిర్మించిన మెట్టూరు డ్యామ్ ద్వారా చాలా సంవత్సరాల నుంచి వినియోగించుకుంటోంది. అయితే కర్ణాటక 1932లో కృష్ణరాజ సాగర్ డ్యామ్ ద్వారా, తమిళనాడుకు వచ్చే కావేరీ జలాల లభ్యత తగ్గిపోవడంతో వివాదాలు ప్రారంభమయ్యాయి.

- కావేరీ నది పరివాహక ప్రాంతం: తమిళనాడు, కర్ణాటక, కేరళ, పాండిచ్చేరిలో ఉంది.
- 1990లో కేంద్ర ప్రభుత్వం కావేరీ వాటర్ డిస్ప్యూట్ ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేసింది.
- 1998లో కావేరీ రివర్ అథారిటీని ఏర్పాటు చేసింది
- 2028 సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కావేరీ నది జలాల పంపిణీ: మొత్తం 726 టీఎంసీలలో కర్ణాటకు 284.75, తమిళనాడుకు 404.25, కేరళకు 30, పాండిచ్చేరికి 7 టీఎంసీల వాటా లభించింది.

ముళ్ల పెరియార్ డ్యామ్ వివాదం

ప్రస్తుత కేరళ రాష్ట్ర సరిహద్దు లోపల, ఒకప్పటి ట్రావెన్ కోర్ సంస్థానంలో పెరియార్ నదిపై ఈ డ్యామును నిర్మించారు. 1886లో బ్రిటిష్ ప్రభుత్వం, ట్రావెన్ కోర్ సంస్థానం నుంచి డ్యామ్ ఉన్న ప్రదేశాన్ని 999 సంవత్సరాలకు లీజుకు తీసుకుని నిర్మించింది. డ్యామ్ వెనుక భాగంలో సొరంగ మార్గాన్ని ఏర్పాటు చేసి, దాని ద్వారా తమిళనాడులోని వైగై నదిలోకి నీటిని సరఫరా చేస్తున్నారు. దీని ద్వారా 68 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారు.



కేరళ వాదన: 120 సంవత్సరాల క్రితం నిర్మించిన డ్యామ్ భద్రత గురించి కేరళ అభ్యంతరాలను తెలియజేస్తోంది. ఇది తెగిపోతే దిగువన ఉన్న ఇడుక్కీ డ్యామ్, పెరియార్ బ్యారేజ్‌లు ప్రమాదంలో పడతాయి. కనుక, ప్రస్తుతమున్న డ్యామ్‌ని కూల్చివేసి, కొత్త డ్యామ్ నిర్మించాలి. అది కూడా ప్రస్తుత 142 అడుగుల ఎత్తు కాకుండా 136 అడుగుల ఎత్తు మాత్రమే నిర్మించాలని వాదిస్తోంది.

తమిళనాడు ప్రభుత్వ వాదన: 2010లో డ్యామ్ భద్రతపై పరిశీలన కోసం ఏ.ఎస్.ఆనంద్ కమిటీ ఏర్పాటు చేశారు. ఈ కమిటీ డ్యామ్ భద్రతకు ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొంది. 136 అడుగుల నుంచి 142 అడుగుల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని స్పష్టం చేసింది.

పాలార్ నది వివాదం

పెన్నా, కావేరీ నదుల మధ్యలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ద్వారా స్వతంత్రంగా ప్రవహించే మధ్యస్థ నది. ఈ నది తమిళనాడులోని వెల్లూరు, కంచి ప్రాంతాలకు జీవనాధారం. ఈ నదిపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్తూరు జిల్లా కుప్పం వద్ద డ్యామ్ నిర్మాణం ప్రారంభించింది. దీనిని తమిళనాడు వ్యతిరేకిస్తోంది.

సింధూనది జలాల ఒప్పందం

1960లో సింధూజలాల ఒప్పందం ఇండియా - పాకిస్థాన్ మధ్య జరిగింది. దీని ప్రకారం పశ్చిమ నదులైన- సింధూ, జీలం, చీనాబ్ నదులలోని మొత్తం నీటి ప్రవాహంలో 80 శాతం పాకిస్థాన్‌కి, 20 శాతం ఇండియాకి కేటాయించారు. తూర్పు నదులైన రావి, సట్లెజ్, బియాస్ నదులలో మొత్తం నీటిలో 80 శాతం ఇండియాకి, 20 శాతం పాకిస్థాన్‌కి కేటాయించారు.

బాగ్లీహార్: ఈ ప్రాజెక్టును సింధూ ఒప్పందానికి వ్యతిరేకంగా చీనాబ్ నదిపై భారత్ నిర్మించింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ప్రపంచ బ్యాంక్‌లో పాకిస్థాన్ ఫిర్యాదు చేసింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు పరిశీలన కోసం లఫైతే(స్విట్జర్లాండ్) కమిటీని నియమించారు. 2010లో ఈ వివాదం పరిష్కారమైంది.

కిషన్ గంగా: ఈ ప్రాజెక్టును సింధూ ఒప్పందానికి వ్యతిరేకంగా జీలం, కిషన్ గంగా నదుల ఆధారంగా నిర్మించారు. ఈ నిర్మాణానికి వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయస్థానంలో పాకిస్థాన్ ఫిర్యాదు చేసింది. ఫలితంగా ఈ ప్రాజెక్టు పరిశీలనకు స్క్వీబెల్ కమిటీ(బ్రిటన్)ని నియమించారు.



వి. వెంకట్‌రెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/UWKOdqu లో చదవండి.

సీయూఈటీ(యూజీ) 2024

దేశవ్యాప్తంగా ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలు సహా పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు, డీమ్డ్ యూనివర్సిటీలు, అటానమస్ కళాశాలలు, ప్రభుత్వ/ ప్రైవేట్ యూనివర్సిటీలు అందిస్తున్న అండర్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలకు ఉద్దేశించిన 'కామన్ యూనివర్సిటీ ఎంట్రెన్స్ టెస్ట్(సీయూఈటీ) యూజీ 2024 నోటిఫికేషన్ వెలువడింది.

ఈ పరీక్షని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహిస్తుంది. హిందీ, ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ సహా మొత్తం 13 మాధ్యమాల్లో పరీక్ష రాయవచ్చు. ఒక జనరల్ టెస్ట్ పేపర్, 33 లాంగ్వేజ్ టెస్ట్ పేపర్లు, 27 డొమైన్ సబ్జెక్ట్ పేపర్ల నుంచి అభ్యర్థులు కనిష్ఠంగా మూడు, గరిష్ఠంగా ఆరు టెస్ట్ పేపర్లు రాసే వీలుంది.

డొమైన్ సబ్జెక్టులు

అకౌంటెన్సీ/బుక్ కీపింగ్, అగ్రికల్చర్, ఆంత్రోపాలజీ, బయాలజీ/బయలాజికల్ స్టడీస్/బయోటెక్నాలజీ/బయో కెమిస్ట్రీ, బిజినెస్ స్టడీస్, కెమిస్ట్రీ, ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, ఎకనామిక్స్/ బిజినెస్ ఎకనామిక్స్, ఇంజనీరింగ్ గ్రాఫిక్స్, ఆంత్రప్రెన్యూర్‌షిప్, ఫైన్ ఆర్ట్స్/ విజువల్ ఆర్ట్స్/కమర్షియల్ ఆర్ట్, జాగ్రఫీ/జియాలజీ, హిస్టరీ, హోం సైన్స్, నాలెడ్జ్ ట్రెడిషన్ ప్రాక్టీసెస్ ఇన్ ఇండియా, లీగల్ స్టడీస్, మాస్ మీడియా/ మాస్ కమ్యూనికేషన్, మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిజికల్ ఎడ్యుకేషన్/నేషనల్ క్యాడెట్ కోర్/యోగా, ఫిజిక్స్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, సంస్కృతం, సోషియాలజీ, టీచింగ్ ఆప్టిట్యూడ్. వీటికి తోడు ఇంగ్లీష్, హిందీ, తెలుగు, ఉర్దూ తదితర సబ్జెక్టులు కూడా ఉన్నాయి

అర్హత

గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు/చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** మూడు సబ్జెక్టుల వరకు జనరల్ అభ్యర్థులు రూ.1000; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.800; విదేశీ అభ్యర్థులు రూ.4500 చెల్లించాలి. ప్రతి అదనపు సబ్జెక్టుకు జనరల్ అభ్యర్థులు రూ.400; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు రూ.375; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.350; విదేశీ అభ్యర్థులు రూ.1800 చెల్లించాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 26
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, https://exams. nta.ac.in/CUET-UG/

ఎగ్జామ్ వివరాలు

దీనిని హైబ్రిడ్ మోడ్(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్/పెన్&పేపర్ టెస్ట్)లో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో మూడు సెక్షన్‌లు ఉంటాయి. మొదటి సెక్షన్‌లో లాంగ్వేజ్ టెస్ట్‌లు ఉంటాయి. రీడింగ్ కాంప్రహెన్షన్, లిటరరీ ఆప్టిట్యూడ్, ఒకాబులరీలకు సంబంధించి 50 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. రెండో సెక్షన్‌లో డొమైన్ సబ్జెక్ట్ టెస్ట్‌లు ఉంటాయి. ఇంటర్/పన్నెండోతరగతి సిలబస్ ఆధారంగా 50 ప్రశ్నలు అడుగుతారు. వీటిలో 40 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. మూడో సెక్షన్‌లో జనరల్ టెస్ట్ ఉంటుంది. ఇందులో జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్, జనరల్ మెంటల్ ఎబిలిటీ, న్యూమరికల్ ఎబిలిటీ, క్వాంటిటేటివ్ రీజనింగ్, లాజికల్ అండ్ అనలిటికల్ రీజనింగ్ అంశాలనుంచి 60 ప్రశ్నలు ఇస్తారు. వీటిలో 50 ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. ప్రశ్నకు అయిదు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు.

అభ్యర్థులు జనరల్ టెస్ట్ సహా డొమైన్ సబ్జెక్టుల నుంచి 4 లేదా 5 పేపర్లు; లాంగ్వేజ్ సబ్జెక్టుల నుంచి 1 లేదా 2 పేపర్లు చొప్పున గరిష్ఠంగా 6 పేపర్లు ఎంచుకోవాలి. జనరల్ టెస్ట్ సహా కనీసం ఒక లాంగ్వేజ్ ఉండేలా చూసుకోవాలి.

మేథమెటిక్స్/అప్లయిడ్ మేథమెటిక్స్, అకౌంటెన్సీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఎకనామిక్స్, కంప్యూటర్ సైన్స్/ఇన్ఫర్మాటిక్స్ ప్రాక్టీసెస్, జనరల్ టెస్ట్ పేపర్లకు ఒక్కోదానికి పరీక్ష సమయం ఒక గంట. మిగిలిన అన్ని పేపర్లకూ ఒక్కోదానికి 45 నిమిషాలు ఇస్తారు.



నారా లోకేశ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

పెమ్మసాని కుటుంబంతో ఎన్నో ఏళ్ల అనుబంధం

- కష్టపడి పనిచేయటం, వెనకడుగు వేయనితత్వం ఆయన నైజం
- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్

మంగళగిరి, ఫిబ్రవరి 28: పెమ్మసాని కుటుంబంతో తెలుగుదేశం పార్టీకి ఎన్నో ఏళ్లుగా అనుబంధం వుందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చెప్పారు. ఉండవల్లిలోని నివాసంలో బుధవారం టీడీపీ నేతలతో ఏర్పాటు చేసిన పరిచయ కార్యక్రమానికి టీడీపీ గుంటూరు పార్లమెంటు నేత డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ కష్టపడి పనిచేయడంలో పెమ్మసాని వెనుకడుగు వేసే వ్యక్తి కాదన్నారు. పనిచేసే వ్యక్తికి ప్రోటోకాల్‌తో పనిలేదని, తనకు పార్టీపరంగా గ్రౌండ్‌వర్క్ చేయడమంటే ఎంతో ఇష్టమన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ రాష్ట్రంలో కుప్పం, మంగళగిరి నియోజకవర్గాలు ఎంతో అదృష్టం చేసుకున్నాయని చెప్పారు. ఎన్నో చోట్ల పోటీ చేసే అవకాశం వున్నా లోకేశ్ మంగళగిరి నియోజకవర్గాన్నే ఎంచుకోవడం ఈప్రాంత ప్రజల అదృష్టమన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్, భవిష్యత్తుకు గ్యారెంటీ హామీలను ప్రతి ఇంటికీ చేర్చాలని పిలుపునిచ్చారు. మంగళగిరి నుంచి లోకేశ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పార్టీశ్రేణులు కృషిచేయాలని పెమ్మసాని కోరారు.



టీడీపీలో చేరిన వైసీపీ మైనార్టీ నేతలతో నారా లోకేశ్, పెమ్మసాని చంద్రశేఖర్

లోకేశ్ సమక్షంలో టీడీపీలోకి భారీగా చేరికలు ..

మంగళగిరి నియోజకవర్గంలో వైసీపీ నేతలు ఒక్కొక్కరుగా ఆ పార్టీని వీడుతున్నారు. వైసీపీకి రాజీనామా చేస్తున్న నేతలు యువనేత నారా లోకేశ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకుంటున్నారు. తాజాగా, వైసీపీ యువజన విభాగం మంగళగిరి పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ సుభానీ, మరో 60 కుటుంబాలు బుధవారం టీడీపీలో చేరాయి. ఉండవల్లి లోని నివాసంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో పసుపు కండువా కప్పుకున్నారు. లోకేశ్ వీరికి పార్టీ కండువాలనుకప్పి సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని, వైసీపీ దుశ్చర్యలను, వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని లోకేశ్ వారికి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు పార్లమెంటు నేత పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు పడవల మహేష్ పాల్గొన్నారు.

పసుపు.. మిలమిల

- రికార్డు స్థాయిలో పసుపు దిగుబడులు
- ఎకరాకు 300 బస్తాల దిగుబడి వచ్చిందంటున్న రైతులు



అరకతో పసుపు దున్నుతున్న కూలీ ,

కొల్లూరు, ఫిబ్రవరి 28: ఓ రైతు రికార్డు స్థాయిలో పసుపు దిగుబడులు సాధించాడు. కొల్లూరు మండలంలోని పోతార్లంక గ్రామానికి చెందిన ఈడ్పుగంటి కుటుంబరావు ఐదెకరాల విస్తీర్ణంలో పసుపు సాగు చేశాడు. మునుపెన్నడూ చూడని విధంగా పసుపు కొమ్ములు ఊరడంతో అత్యధిక దిగుబడులు వస్తున్నాయని చెబుతున్నాడు. సేలం పసుపు విత్తనాన్ని ఎకరాకు సుమారు పది క్వింటాళ్ల వరకు విత్తానని, ఎకరాకు లక్షన్నర నుంచి రెండు లక్షల వరకు పంటపై పెట్టుబడులు పెట్టానని అన్నారు. ఒక్కో ఎకరాకు 75 కిలోల బస్తా చొప్పున 300 బస్తాల పసుపు వచ్చినట్లు పేర్కొన్నారు. పచ్చి పసుపు వండిన అనంతరం ఎకరాకు 50 క్వింటాళ్లు దిగుబడి ఆశిస్తున్నట్లు చెప్పారు. అరకతో దున్నగా వచ్చిన పసుపును పోగు చేసేందుకు రోజు 70మంది కూలీలు అవసరమైనట్లు ఆయన తెలిపారు. గతంలో క్వింటా పసుపు రూ.5 నుంచి రూ.7 వేలు వరకు ధర పలుకగా, ప్రస్తుతం వండిన పసుపు క్వింటా రూ.12 వేలకు వ్యాపారులు యార్డులో కొనుగోలు చేస్తున్నారన్నారు. భవిష్యత్‌లో పసుపు ధర రూ.15 వేలు వరకు కూడా పలుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



గతం కంటే అధిక దిగుబడులు...

కొల్లూరు మండలంలోని లంక గ్రామాల్లో ఈ ఏడాది పసుపు సాగు చేసిన రైతులు అధిక దిగుబడులు పొందుతున్నారు. గతంలో ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రాగా, ప్రస్తుతం చేస్తున్న పసుపు తవ్వకాల్లో కొమ్ములు బాగా ఊరడంతో ఎకరాకు 30 క్విం టాళ్ల పైనే దిగుబడి రావచ్చని రైతులు చెబుతున్నారు. గతంలో పసుపు సాగుచేసి దెబ్బతిన్న రైతులు ఈఏడాది దిగుబడులపరంగా, ధర పరంగా కూడా ఆశాజనకంగా ఉండటంతో గతంలో పంటలపై పెట్టిన పెట్టుబడుల రుణాలను తీర్చుకునే విధంగా పసుపు దిగుబడులు వస్తున్నాయని పసుపు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.





దున్నిన పసుపును ఏరుతున్న కూలీలు , రైతు కుటుంబరావు (ఇన్‌సెట్లో)

చీరలిస్తాం.. ఓటెయ్యండి..

రాజుపాలెం, ఫిబ్రవరి 28: ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే ఓటర్లకు తాయిలాలు పంచే కార్యక్రమానికి వైసీపీ నేతలు తెర తీశారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో రెండు రోజుల కిందట వైసీపీ ఎంపీపీ తేలుకుట్ల రాజేశ్వరి, స్థానిక వైసీపీ నాయకులు వేల్పుల వెంకటేశ్వర్లు, స్థానిక వలంటీరుతో కలిసి చీరల పంపిణీకి సిద్ధపడ్డారు. ఇంటికో చీర ఇస్తామంటూ దాదాపు వెయ్యి చీరలను తీసుకుని తిరిగారు. కొందరు ఓటర్లు ఈ చీరలను తీసుకోగా టీడీపీ వర్గీయులు మాత్రం వాటిని తీసుకునేందుకు నిరాకరించారు. మాకు వద్దు అని గట్టిగా చెప్పటంతో అధికార పార్టీ నేతలు జారుకున్నారు.

చిరువ్యాపారులకు.. ఆశీలు ఫీజు రద్దు చేస్తాం



యూరో కార్ట్ ట్రైనింగ్ మాడ్యూల్‌ను ఆవిష్కరిస్తున్న లోకేశ్ తదితరులు

- టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్
- మంగళగిరిలో యూరో కార్టు సేవలకు శ్రీకారం
- 50 మంది చిరు వ్యాపారులకు కార్టులు పంపిణీ

మంగళగిరి, ఫిబ్రవరి 28: టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిరువ్యాపారులకు ఆశీలు ఫీజును రద్దు చేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ హామీ ఇచ్చారు. మంగళగిరి నియోజకవర్గంలో చిరువ్యాపారుల జీవనోపాధికి వివిధ రూపాల్లో చేయూతనిస్తున్న యువనేత లోకేశ్ మరో ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. చిరువ్యాపారుల ఆదాయాన్ని కనీసం 50 శాతం పెంచే దిశగా ఎన్నారై టీడీపీ సహకారంతో అధునాతన యూరో కార్టు సేవలను బుధవారం ప్రారంభించారు. రోడ్లవెంబడి టిఫిన్ బండ్లపై వ్యాపారం చేసుకునే చిరువ్యాపారులకు పాశ్చాత్య దేశాల్లో మాదిరి అధునాత సదుపాయాలతో కూడిన యూరో కార్టులను అందజేశారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమం పేరిట కుడిచేత్తో రూ.పది ఇచ్చి.. ఎడమ చేత్తో రూ.వంద లాగేస్తున్నారని విమర్శించారు. వీధి వ్యాపారులకు వడ్డీలేని రుణాల పేరుతో రూ.పది వేలు ఇస్తూ.. అదే సమయంలో ఆశీలు పేరుతో ఏటా రూ.10,800 దోచేస్తున్నారని ఆరోపించారు. చిరువ్యాపారులు ఎక్కడైతే రోజువారీ బండ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారో వారికి అక్కడే లైసెన్సులు ఇచ్చి పోలీసు వేధింపులు లేకుండా చేస్తామన్నారు. బండ్ల వద్ద చెత్తను మునిసిపాలిటీల ద్వారా సేకరించే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. యూరో కార్టులు పొందిన లబ్ధిదారులకు బ్యాంకు ద్వారా వర్కింగ్ క్యాపిటల్ సమకూరుస్తున్నందున అడ్డగోలు వడ్డీల బెడద వుండదన్నారు. శుభ్రత విషయంలో వెస్టిన్ హోటల్ మేనేజ్‌మెంట్ వారిచే 5స్టార్ హోటళ్లకు ధీటుగా శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, ఎన్నారై టీడీపీ ప్రతినిధులు గుంటుపల్లి జయకుమార్, మురళీ రావర్ల, యూరో కార్ట్ డిజైనర్ కృష్ణంరాజు, వెస్ట్ ఇన్ ట్రైనర్ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యూరోకార్టు ప్రత్యేకతలెన్నెన్నో..

అధునాతనంగా రూపొందించిన యూరోకార్టులు తేలికగా శుభ్రం చేసుకోవడానికి అనువుగా వుంటాయి. శుభ్రత విషయంలో స్టార్ హోటళ్లకు దీటుగా వెస్టిన్ హోటల్ మేనేజ్‌మెంట్ స్కూల్ తరఫున చిరువ్యాపారులకు ఉచితంగా శిక్షణ ఇస్తారు. చిరువ్యాపారులకు అవసరమైన రోజువారీ సరుకులను ఆర్డర్‌పై వేర్వేరు బ్రాండెడ్ స్టోర్స్ వారు బండి వద్దకే పంపేలా ఏర్పాట్లు చేశారు. ఈ లావాదేవీలకు అవసరమైన బ్యాంకు సేవలను హెచ్‌డీఎఫ్‌సీ వారు అందిస్తారు. రోజువారీ వ్యాపారం ద్వారా వచ్చే ఆదాయంతోపాటు యూరోకార్టు స్క్రీన్‌పై ప్రకటనల ద్వారా కూడా మరికొంత ఆదాయం పొందే అవకాశం వుంది. ఎన్నారై టీడీపీ ప్రతినిధులు గుంటుపల్లి జయకుమార్, మురళీ రావర్ల సహకారంతో ఈ పైలట్ ప్రాజెక్టును బుధవారం ఉండవల్లిలోని నివాసం వద్ద నారా లోకేశ్ లాంఛనంగా ప్రారంభించారు. చిరువ్యాపారుల ఆదాయంతోపాటు జీవన ప్రమాణాలు పెంచేందుకు ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. పైలట్ ప్రాజెక్టు విజయవంతమైతే రాబోయే ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రం మొత్తం విస్తరించాలని భావిస్తున్నట్టు లోకేశ్ తెలిపారు. తొలి దశలో భాగంగా మంగళగిరి నియోజకవర్గంలో 50 మంది మహిళలకు శిక్షణ ఇచ్చి యూరో కార్టులు అందించారు. వారిలో కొంత మంది లబ్ధిదారులకు బుధవారం లోకేశ్ చేతుల మీదుగా యూరోకార్టులను అందజేశారు.

టీడీపీ, వైసీపీ వర్గీయుల బాహాబాహీ

- ఫ్లెక్సీల ఏర్పాటుపై చెలరేగిన వివాదం
- ఎనిమిది మందికి గాయాలు

మాచర్ల, ఫిబ్రవరి 28: ఫెక్సీల ఏర్పాటుపై చెలరేగిన వివాదంలో టీడీపీ, వైసీపీ వర్గీయులు బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు కర్రలు, రాడ్లతో దాడికి దిగడంతో ఇరువర్గాలకు చెందిన 8 మందికి గాయాలయ్యాయి. ఈ ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పట్టణంలోని తూర్పు బావి జెండా చెట్టు ప్రాంతంలో బుధవారం సాయంత్రం బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించేందుకు పార్టీ నేతలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మధ్యాహ్నా సమయంలో టీడీపీ నేతలు ఆ ప్రాంతంలో తమ పార్టీ ఫ్లెక్సీలు, జెండాలు, తోరణాలు ఏర్పాటు చేసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమయంలో వైసీపీ నేతలు ఆ ఫ్లెక్సీలను చించారు. ఈ క్రమంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య వివాదం చెలరేగింది. అనంతరం ఒకరిపై ఒకరు కర్రలు, రాడ్లతో దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో టీడీపీకి చెందిన మోసిన్, ముజుఫర్, నాసిర్, జానిలకు గాయాలు కాగా వైసీపీకి చెందిన అహ్మద్, నాగుల్‌మీరా, యూసుఫ్, అంగర్‌బాషాలకు గాయాలయ్యాయి. గాయపడిన వైసీపీ నేతలను మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కాగా టీడీపీ నేతలు గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పట్టణ సీఐ శరత్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు.

వైసీపీ నేతలు ధర్నా... దాడిని ఖండిస్తూ ఆ పార్టీ నేతలు పట్టణంలోని పార్కు సెంటర్ వద్ద ధర్నాకు దిగారు. దాడికి పాల్పడిన టీడీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ శరత్‌బాబు అక్కడకు చేరుకొని ఆందోళనకారులతో మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీనివ్వడంతో వైసీపీ నేతలు ధర్నా విరమించారు.

ప్రజాదరణ ఓర్వలేకే చిచ్చు

- టీడీపీ నేతలపై అసత్యపు ప్రచారం
- టీడీపీ మాచర్ల నియోజకవర్గ అభ్యర్థి బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 28: టీడీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక వైసీపీ నేతలు పట్టణంలోని ముస్లిం గడ్డపై చిచ్చు పెట్టాలని చూస్తున్నారని టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని తూర్పుబావి జెండా చెట్టు వద్ద జరిగిన ఘర్షణపై స్పందించారు. మండల కేంద్రమైన వెల్దుర్తిలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జెండా చెట్టు వద్ద జరిగిన ఘర్షణలో టీడీపీ నేతలు దాడి చేశారని అధికార పార్టీ నేతలు అసత్యపు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అబద్ధాలు ఆడడంలో స్థానిక ఎమ్మెల్యే పీఆర్కే ఘనపాటి అని, పల్లెటూరు నుంచి వచ్చి దాడి చేశారని ప్రచారం గావిస్తున్నారని, ఆ ఘర్షణలో పల్లెటూరు వాళ్లు ఎవరున్నారో రుజువు చేయాలన్నారు. టీడీపీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక మసీదు సెంటర్లో కర్రలు దాచి పెట్టి దాడి చేశారన్నారు. పథకం ప్రకారం తమ పార్టీ నేతలపై దాడి చేశారని, లేకుంటే మసీదుకు వెళ్లేవారు కర్రలు, కత్తులతో వస్తారా అని ప్రశ్నించారు. తమ పార్టీ శ్రేణులపై తప్పుడు కేసులు పెడితే పోలీసు శాఖపై కోర్టుకు వెళ్తామని హెచ్చరించారు.



టీవీలో వీడియో చూపుతూ మాట్లాడుతున్న టీడీపీ మాచర్ల ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.90
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	150, 159,170
చికెన్ విత్ స్కిన్	290.00
చికెన్ స్కిన్ లెస్	300.00

అధర్మం నాలుగు పాదాల మీద నడక

- మచిలీపట్నం ఎంపీ, జనసేన నేత బాలశౌరి



గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పరిపాలనలో అధర్మం నాలుగు పాదాల మీద నడుస్తున్నదని మచిలీపట్నం ఎంపీ, జనసేన నేత వల్లభనేని బాలశౌరి ఆరోపించారు. ఎక్కడ చూసినా అధర్మం, అన్యాయం, అక్రమం రాజ్యమేలుతున్నాయి. ఆ పార్టీ నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు బయ టకు వస్తుండటానికి ప్రధాన కారణాలు ఇవేనన్నారు. ఎవరైనా ఏదైనా మాట్లాడితే వెంటనే వాళ్ల మీద ఎదురుదాడికి దిగడం, నేతలతో తిట్టించడం పరిపాటైపోయిందన్నారు. బుధవారం గుంటూరు నుంచి తన అనుచరులతో కలిసి తాడేపల్లిగూడెం జెండా బహిరంగ సభకు ఆయన బయలుదేరుతూ పాత్రికేయులతో మాట్లాడారు. తాడేపల్లిగూడెం సభకు మచిలీపట్నంలోని అన్ని నియోజకవర్గాల నుంచి వెయ్యి కార్లలో జనసైనికులు బయలుదేరారని చెప్పారు. వైసీపీ విముక్తిని ప్రజలు కోరుకొంటున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వా మ్యం, స్వేచ్ఛ ఉండాలని ఆకాంక్షిస్తున్నారని తెలిపారు. భయాందోళనలో ఉన్న ప్రజలకు భరోస కల్పించేందుకే తాడేపల్లిగూడెంలో లక్షలాది మంది టీడీపీ, జనసేన పార్టీ కార్యకర్తలతో బహిరంగ సభ ఏర్పాటు చేశామన్నారు. వైసీపీని ఇంటికి పంపించేందుకు జనసేనాని పవన్ కల్యాణ్ ఏమి నిర్ణయం తీసుకొన్నా తామంతా కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. వైసీపీ బాధితులంతా టీడీపీ -జనసేనకూటమితో చేతులు కలపాలని విజ్ఞప్తి చేశారు. తప్పక స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రభుత్వం ఏర్పాటు చేసుకొందామన్నారు. ఎన్నికల సమయంలో సీట్లపంపిణీ సందర్భంగా ఏ పార్టీలోనైనా అసంతృప్తులు సహజమని, పోలింగ్ నాటికి అవన్నీ సర్దుకొంటాయన్నారు. ఇప్పుడు టిక్కెట్ రాలేని వారికి భవిష్యత్తులో రాజ్యసభ, ఎమ్మెల్సీ, కార్పొరేషన్ల చైర్మన్, ఇతర నామినేటెడ్ పదవులు కల్పించి తగినరీతిలో గౌరవిస్తామని చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి అనేదిలేదు. పోలవరం ప్రాజెక్టుని గత ప్రభుత్వం 75 శాతం నిర్మిస్తే వైసీపీ ఐదేళ్లలో కనీసం 5శాతం కూడా నిర్మాణం చేయలేదు. అసలు ఆ ప్రాజెక్టుని ఎలా పూర్తి చేయాలనే నిర్ణయమే తీసుకోలేదు. తాను జలజీవన్ మిషన్ కింద కేంద్రం నుంచి మచిలీపట్నంకు రూ.200 కోట్లు తీసుకొస్తే కనీసం మ్యాచింగ్ గ్రాంటుని వైసీపీ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. వైసీపీని ఇంటికి పంపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఇందులో ఎలాంటి అనుమానం లేదని చెప్పారు. తాను మచిలీపట్నం నుంచి తిరిగి గెలిచి రాబోయే ఐదేళ్లలో బందరు - రేపల్లె రైల్వే లైను, గుడివాడ - కంకిపాడు గ్రీన్‌ఫీల్డ్ హైవే తదితర ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు.

జగన్ మాట తప్పాడు.. మడమ తిప్పాడు

- మద్యం ఆదాయంలో రూ.లక్ష కోట్లు దోచేసిన సీఎం
- రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఫిబ్రవరి 28: మద్యనిషేధం అమలు చేసిన తర్వాతే ప్రజలను ఓట్లు అడుగుతానని చెప్పిన జగన్ రెడ్డి ఆ హామీ అమలులో మాట తప్పాడని, మడమ తిప్పాడని రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. రాష్ట్రంలో మద్యం రేట్లు మూడు రెట్లు పెంచారని, సీఎం జగన్‌రెడ్డి 57 నెలల పాలనా కాలంలో సుమారు రూ.2 లక్షల కోట్లు విలు వైన నాసిరకం మద్యం అమ్మి రూ.1 లక్ష కోట్లు ఆదాయాన్ని తాడేపల్లి ప్యాలెస్‌కు తరలించాడని ఆరోపించారు. రాష్ట్రంలో నాసిరకం మదం తాగి 30 వేల మంది ప్రాణాలు కోల్పోగా, దాదాపు 30 లక్షల మంది ఆరోగ్యాలు దెబ్బతిని ఆస్పత్రుల పాలయ్యారన్నారు. నాసిరకం మద్యం, గంజాయి, మాదకద్రవ్యాల బారినపడిన యువత అన్యా యమై పోతున్నారన్నారు. అత్యాచారాలు, నేరాలు, భారీగా పెరిగాయన్నారు. రాబోయే 15 ఏళ్ళ పాటు మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టి రూ.40వేల కోట్లు అప్పు తెచ్చి సీఎం జగన్‌రెడ్డి తాడేపల్లి ప్యాలెస్‌లో దాచారని ఆరోపించారు. ప్రభుత్వ మద్యంషాపుల్లో నగదు లావాదేవీలు మాత్రమే చేస్తున్నారని, డిజిటల్ చెల్లింపులు ఎందుకు చేయటంలేదని ప్రశ్నించారు. నాసిరకం మద్యం అమ్మకాల్లో సీఎం జగన్ ఒక్కడే రూ.లక్ష కోట్ల కమీషన్ కొట్టివేశాడని, మిగతా వైసీపీ నేతలు వేల కోట్ల రూపాయలు దోచేశారన్నారు. ఈ దందా అంతా జగన్, విజయసాయిరెడ్డి సిండికేట్ ద్వారానే జరుగుతుందన్నారు. నాసిరకం మద్యం పోవాలంటే, మహిళల మాంగాల్యాలు నిలవాలంటే రానున్న ఎన్నికల్లో వైసీపీని ఓడించాలని, టీడీపీ - జనసేన కూటమిని గెలిపించాలని అనగాని ప్రజలను కోరారు.



తుళ్లూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు రైతులు

వైసీపీ పాలనలో అంతా దగాయే !

- రాజధానికి భూములిచ్చిన రైతులను మోసం చేసిన జగన్‌రెడ్డి
- 1534 వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు ఫిబ్రవరి 28: వైసీపీ పాలనలో అంతా దగాయేనని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆరోపించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు బుధ వారం నాటికి 1534వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు మాట్లాడుతూ.. రాష్ట్రానికి మూడు రాజధానులు వద్దు, అన్ని వర్గాల ప్రజలు అమరావతినే రాజధానిగా కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. అవరావతిని నిర్వీర్యం చేయాలనే సీఎం జగన్‌రెడ్డి దుశ్చర్యను దేశం మొత్తం ఖండించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రానికి మూడు రాజధానులు ఉన్నాయో జగన్‌రెడ్డి చెప్పాలన్నారు. రాష్ట్రానికి ప్రయోజనం కలిగించే ఏ పని అయన చేయలేదన్నారు. దీంతో అభివృద్ధిలో రాష్ట్రం 20 ఏళ్ల వెనకబడిపోయిందని ఆవేదన వ్యక్తంచేశారు. రాజధాని అమరావతి విషయంలో వైసీపీ ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం ఎన్నిసార్లు మొట్టికాయలు వేసిన సిగ్గురావటం లేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి , జై అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాలలో ఆందోళనలు కొనసాగాయి.

మహిళా కౌలు రైతు ఆత్మహత్య

- అప్పుల బాధ తాళలేక ఉరివేసుకున్న వైనం

పెదనందిపాడు, ఫిబ్రవరి 28: మండలంలోని రావిపాడులో అప్పుల బాధతో ఓ మహిళా కౌలురైతు బుధవారం ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గుంటూరు స్వామ్రాజ్యం(43) కూలి పనులు చేసుకుంటూ ఉండేది, గతంలో 5 ఎకరాలు పొలం కౌలుకు తీసుకొని మిరప పంట సాగు చేశారు. సరైన దిగుబడి లేక అప్పులపాలవగా ఈ ఏడాది ఒక ఎకరం మాత్రమే కౌలుకు తీసుకొని మిర్చి పంట సాగు చేసింది. భారీ వర్షాలకు, తామర పురుగు బెడదతో పంట పూర్తిగా దెబ్బతినడంతో పీకేసి పొగాకు సాగు చేశారు. తెచ్చిన అప్పులు తీరుతాయో లేదోనని మనోవేదనకు గురై వేకువజామున ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఇంటికి వచ్చి చూడగా అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. సంఘటనా స్థలానికి ఎస్ఐ రాజకుమార్ చేరుకొని వివరాలు సేకరించారు. భర్త సుబ్బారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

1,39,349 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 1,16,503 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,39,349 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 96,590 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	20000
నెంబరు. 5	12000	17000
273	9000	19500
341	8500	20500
4884	8500	17800
సూపర్ 10	11500	19000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21000
బ్యాడిగి	10500	20000
దేవనూరు డీలక్స్	10000	20000
తెల్లకాయలు	5000	12500

ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం

● జిల్లాలో 35 కేంద్రాల్లో హాజరుకానున్న 19,853 మంది విద్యార్థులు



చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచనలు చేస్తున్న డీవీఈవో యర్రయ్య

బాపట్లటౌన్, ఫిబ్రవరి 28 : జిల్లాలో ఇంటర్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేశారు. మార్చి ఒకటో తేదీ శుక్రవా రం నుంచి 20 వరకు జరగనున్న ఇంటర్ పరీక్షలకు జిల్లాలో 35 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లా ఇంటర్ వృత్తి విద్యాశాఖాధికారి పి.యర్రయ్య బుధవారం వివిధ పరీక్ష కేంద్రాల్లోని వసతులను పరిశీలించి చీఫ్ సూపరింటెండెంట్‌లకు సూచనలు చేశారు. జిల్లాలో 35 పరీక్ష కేంద్రాల్లో జూనియర్ ఇంటర్‌లో జనరల్ విద్యార్థులు 8624, ఒకేషనల్ 466 మొత్తంగా 9090 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్‌లో జనరల్ 10316, ఒకేషనల్ 447 మొత్తంగా 10763 మంది విద్యార్థులు జిల్లాలో 35 కేంద్రాల్లో మొత్తం 19853 మంది విద్యార్థులు హాజరు కానున్నారు. పరీక్షల్లో ప్రతిరోజు ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు జరుగుతాయి. అరగంట ముందుగా విద్యార్థులను పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైన అనుమతించరు. విద్యార్థులంతా నిర్ణీత సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి. జిల్లాలో 4 సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించి పటిష్టమైన బందోబస్తుతోపాటు హైపవర్‌కమిటీ, స్క్వాడ్ బృందాలు క్షుణ్ణంగా విద్యార్థులను తనిఖీ చేపట్టనున్నట్లు యర్రయ్య తెలిపారు.

విద్యార్థులకు పూర్తి వసతులు కల్పించాలి

గత ఏడాది ఇంటర్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు గాలి, వెలుతురు, కొరతగా ఉన్న ఫర్నీచర్‌తో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ ఏడాది ఇప్పటికే ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతండటంతో గాలి, వెలుతురుతోపాటు పూర్తిగా ఫర్నిచర్, రవాణా సదుపాయాలు కల్పించాలని, మెడికల్ కిట్‌లు ఆయా కేంద్రాల వద్ద అందుబాటులో ఉంచి పరీక్షలు సజావుగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ప్రభుత్వాలు

● కలెక్టర్ పి.రంజిత్‌బాషా



రైతులకు మెగా చెక్కు అందజేస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎమ్మెల్సీ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

బాపట్ల, ఫిబ్రవరి 28: రైతు సంక్షేమమే ధ్యేయంగా, రైతు బాగుపడితే రాష్ట్రం బాగు పడుతుందనే సదాశయంతో కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు పనిచేస్తున్నాయని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ పేరిట ఏటా అందజేసే ఆర్థికసాయంలో భాగంగా 5వ ఏట మూడో విడత చెల్లింపు కార్యక్రమంతోపాటు సున్నావడ్డీ పంట రుణాల పథకంలో భాగంగా బుధవారం ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయం నుంచి బటనొక్కి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి రైతు ఖాతాల్లో జమ చేయగా కలెక్టరేట్‌లో వీక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చి జిల్లాలోని 1,92,037 మంది రైతులకు 38.65 కోట్ల రూపాయలు జమ చేస్తున్నామని, స్వంతభూమి సాగు చేసుకుంటున్న రైతులతో పాటు పేదకౌలు రైతుల కష్టాలను గమనించి వారికి కూడా అమలు చేస్తున్నామన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాలు పథకం కింద 36,400 కుటుంబాలకు 7.2 కోట్ల రూపాయలు జమ చేస్తున్నామన్నారు. అనంతరం రైతులకు మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, హార్టికల్చర్ ఏడీ జెన్నెమ్మ, వివిధ ప్రాంతాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్‌డే వేడుకలు



ప్రదర్శన నిర్వహిస్తున్న బాపట్ల పట్టణ ప్రగతి టైలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు

బాపట్ల, ఫిబ్రవరి 28 : బాపట్ల పట్టణ ప్రగతి టైలర్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియే షన్ ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్య క్రమంలో భాగంగా కుట్టుమిషన్ సృష్టికర్త ఇలియాస్‌హోవే పటానికి పుష్పాంజలి ఘటించారు. పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. కూరగాయల మార్కెట్ సమీ పంలోని షాదీఖానా వరకు ప్రదర్శన నిర్వహించి అక్కడ జరిగిన సమావేశంలో ప్రముఖ వ్యాపారవేత్త ఆలపర్తి శ్రీనివాసరావు, న్యాయవాది ఆలపర్తి నాగేశ్వరరావులను సన్మానించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షు లు వేల్పుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ టైలర్స్ వృత్తిని ప్రభుత్వం గుర్తించలేదని వచ్చే తరంవారు ఈవృత్తిని అనుసరించేవారు కూడా ఉండరన్నారు. ట్రైనింగ్ సెంటర్లు పెట్టి సబ్సిడీపై యంత్రపరికరాలు, కరెంట్ అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఉప్పలపాటి మాధవరావు, వేల్పూరి శ్రీనివాసరావు, షేక్.జిలానీ, షేక్.మౌలాసాహేబ్, ఎస్‌కె.అల్లాభక్షు, పి.శ్రీనివాసరావు, షేక్.పీరా, షేక్.ఖాదర్, మస్తాన్, షేక్.నజీర్ తదితరులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, ఫిబ్రవరి 28 : కర్లపాలెం టైలర్స్ భవనంలో ఫ్రెండ్స్ టైలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం టైలర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేశారు. కుట్టుమిషన్ కనిపెట్టిన జర్మనీకి చెందిన విలియమ్స్‌హోవే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ షేక్.సుభానీ, వైస్ ప్రెసిడెంట్ గంటా బాజి, సెక్రటరి షేక్.బాజి, జాయింట్ సెక్రటరి షేక్.మౌలాలి, ట్రెజరర్ పఠాన్ సర్దార్, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

● వేమూరు, ఫిబ్రవరి 28 : టైలర్ వృత్తిని చేనేత వస్త్ర కార్మికుల జాబితాలోకి ప్రభుత్వం చేర్చాలని టైలర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు షేక్ ఇబ్రహీం డిమాండ్ చేశారు. టైలర్స్ డే కార్యక్రమాన్ని బుధవారం వేమూరులో నిర్వహించారు. ముందుగా అసోసియేషన్ అధ్యక్షులుగా ఉన్న షేక్ అబ్దుల్లా ఇటీవల మృతి చెందడంతో సభ్యులు ఆయనకు సంతాపాన్ని వ్యక్తపరుస్తూ రెండు నిమిషాలు మౌనాన్ని పాటించారు. అధ్యక్షత వహించిన ఇబ్రహీం మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వృత్తుల వారికి ఇచ్చిన గుర్తింపు తమకు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తపరిచారు. ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, కోశాధికారి షేక్ జానీ, కౌన్సిలర్ సభ్యులు సాంబశివరావు, విజయ్, శివన్నారాయణ, తదితరులు ప్రసంగించారు. పలు గ్రామాలకు చెందిన టైలర్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రెడ్డి సేవామిత్ర చారిటబుల్‌ట్రస్ట్ పోస్టర్ అవిష్కరణ

బాపట్ల, ఫిబ్రవరి 28 : రెడ్డి సేవామిత్ర చారిటబుల్‌ట్రస్ట్ పోస్టర్‌ను బుధవారం అవిష్కరించారు. మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి, వైసీపీ నాయకులు మోదుగుల బసవపున్నారెడ్డి, టీడీపీ నాయకులు మోదుగుల శంకరరెడ్డి, రవిరెడ్డి, వీరరాఘవరెడ్డి, మస్తాన్‌బేగ్, విజయ్, నంగు శ్రీనివాసరెడ్డి, నంగుగోవర్ధనరెడ్డి తదితరు లు కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. ట్రస్ట్ ఆశయాలను వివరించారు. మాజీమంత్రి గాదె వెంకటరెడ్డితో కలిసి కూడా పోస్టర్ ఆవిష్కరించారు.

మాలల సింహగర్జన జయప్రదం చేయాలి : మల్లెల

బాపట్ల, ఫిబ్రవరి 28: స్థానిక అంబేద్కర్‌భవన్‌లో మార్చి 3వ తేదిన జరిగే మాలల సింహగర్జన మహాసభను జయప్రదం చేయాలని మాలమహాసభ వ్యవస్థాపకుడు మల్లెల వెంకట్రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌లను బుధవారం బాపట్ల అంబేద్కర్ సర్కిల్‌లో ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా సింహగర్జనసభ జరుగుతుందన్నారు. రాష్ట్రంలో మెజార్టీగా ఉన్న దళితులను విభజించే ప్రక్రియ రాజ్యాధికారానికి దూరం చేసే ఆలోచనలు నేటి రాజకీయపార్టీలు చేస్తున్నాయన్నారు. వాటిని తిప్పికొట్టే దిశగా ఏర్పాటు చేసే సింహగర్జన కార్యక్రమానికి పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్య క్రమంలో అంబేద్కర్ సేవాసమాజం అధ్యక్షుడు దగ్గుమల్లి కిరణ్‌కుమార్, నాయకులు గుదే రాజారావు, పర్రె కోటయ్య, గొర్రెముచ్చు వందనం, కొచ్చెర వినయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

వినాయకుని ఆలయంలో స్తోత్ర పారాయణం

బాపట్ల, ఫిబ్రవరి 28 : పట్టణంలోని కూరగాయల మార్కెట్ ప్రాంగణంలోని వినాయకుని ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా విశ్వహిందుపరిషత్ సత్సంగ మహిళా ప్రముఖ్ బండ్రెడ్డి రజనీ ఆధ్వర్యంలో బుధవారం శ్రీరామరక్ష, వినాయకుని స్తోత్రాలు పారాయణం చేశారు. కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు బూర్లె రత్తయ్య, శివన్నారాయణ, భావన్నారాయణ, మద్దుల వెంకటేశ్వర్లు, శేషగిరి, అంగలకుదురు నటరాజన్, లలిత, మాలతి, శారద, విజయ పాల్గొన్నారు.

విజయం సాధించే విధంగా అడుగులు వేయాలి

● టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ



మహిళా నాయకులకు దిశ, నిర్దేశం చేస్తున్న వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, ఫిబ్రవరి 28: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించేవిధంగా మహిళా నాయకులంతా ఐక్యంగా అడుగులు వేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ కోరారు. బాపట్ల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం పార్టీశ్రేణులతో నరేంద్రవర్మ సమావేశం అయ్యారు. ప్రతి ఒక్కరు చేయాల్సిన కార్యక్రమాలపై దిశ, నిర్దేశం చేశారు. గెలుస్తామనే ధీమాతో ఉండకుండా గెలిపించాలనే పట్టుదలతో ప్రతిఒక్కరు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ, మండల అధ్యక్షురాలు కాగిత నాగభూషణమ్మ, మహిళా నాయకులు, మాజీ కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

అసమర్థపాలనకు చరమగీతం పాడాలి

బాపట్ల, ఫిబ్రవరి 28: ఓటు అనే ఆయుధంతో వైసీపీ అసమర్థపాలనకు చరమగీతం పాడాలని తెలుగుదేశంపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి, నియోజకవర్గ ఇన్‌చార్జి వేగేశన నరేంద్రవర్మ కోరారు. మండలంలోని పూండ్ల గ్రామంలో బుధవారం తెలుగుదేశం, జనసేనపార్టీ ఆధ్వర్యంలో మీమాట-నాబాట, జనసేన, టీడీపీ జనబాట, ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ మహిళలకు చీరలు, సంచులు, కరపత్రాలు అందజేసి ఉమ్మడి మ్యానిఫెస్టో గురించి మహిళలకు వివరించారు. ఆడపడుచుల ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ముక్కాముల సాంబశివరావు, మాజీ సర్పంచులు చౌదరి, ఇనగంటి గాంధీ, గుడిపూడి సర్పంచ్ హనుమాన్ జీ, టీడీపీ నాయకులు మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అడ్డదారిలో నడిచే అడ్డాగా.. పాపాల నిలయంగా బాపట్ల

బాపట్ల, ఫిబ్రవరి 28: వైసీపీ పాలనలో బాపట్ల పట్టణం అడ్డదారిలో నడిచే అడ్డాగా, పాపాల నిలయంగా మారిందని వేగేశన నరేంద్రవర్మ దుయ్యబట్టారు. పార్టీశ్రేణులతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో నరేంద్రవర్మ మాట్లాడుతూ ఎమ్మెల్యే కోన రఘుపతి అక్రమాలు తారస్థాయికి చేరాయని విమర్శించారు. పట్టణంలో ఉన్న డివైడర్లు తొలగించి వాటి స్థానంలోనే తిరిగి డివైడర్లు నిర్మిస్తున్నారన్నారు. అధికారులు ఇచ్చిన మార్కింగ్‌ను వదిలేసి ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ కోట్ల రూపాయల ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. శ్రీనివాస్‌నగర్ కాలనీ వద్ద కాలనీవాసులకు దారి ఇచ్చేందుకు 10లక్షల రూపాయలు లంచం అడిగారని ఆరోపించారు. సాయిప్యాలెస్ ఎదురు తొలిగించినచోటే డివైడర్ తిరిగి నిర్మిస్తున్నారన్నారు. డివైడర్‌లు తొలగించగా వచ్చిన మట్టిని వైసీపీ పట్టణాధ్యక్షుడు కాగిత సుధీర్‌బాబు తన స్వంత స్థలంలో మెరక చేయటానికి వినియోగించుకుంటున్నాడని ఆరోపించారు. సమావేశంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు తోట నారాయణరావు, పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి తానికొండ దయాబాబు, నాయకులు ఫరీద్‌మస్తాన్, షాకా, కొల్లూరి వెంకట్రావు, నాగరాజు, శేఖర్, వెంకటేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్‌డే వేడుకలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీవాణి తదితరులు

బాపట్ల,ఫిబ్రవరి 28: బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ సైన్స్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. అడ్వాన్స్‌ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజి టూ ఫ్యూచర్‌వరల్డ్ అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి నంబూరు వీవీఐటీ కాలేజి అసోసియేట్ ప్రొఫెసర్ ఎ.శ్రీవాణి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ మనం అభివృద్ధి చెందాలంటే శోధన ఉండాలన్నారు. టుడే సైన్స్ టుమారో టెక్నాలజి విద్యార్థి దశలో ఉన్నప్పుడు ఎంత విజ్ఞానాన్ని, ఆధునీకరణ వసతులను వినియోగించుకుంటూ సమయాన్ని వృథా చేయకుండా నిరంత రం కృషి చేయాలని తెలిపారు. ప్రస్తుతం ఉన్న సాంకేతిక జ్ఞానాన్ని కూడా నేర్చుకొ ని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా ఐ.హరిత, ఓ.శ్రీదేవి, సీఎస్ఈ, ఈసీఈ విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

● బాపట్ల, ఫిబ్రవరి 28 : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని చెరువుజమ్ములపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఎగ్జిబిట్స్ ప్రదర్శించిన విద్యార్థులకు, సైన్స్‌క్విజ్‌లో పాల్గొన్న వారికి తైవాన్ జామ మొక్కలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీవీ కృష్ణారావు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విక్టోరియమ్మ, జై.కమల, ఎ.కృష్ణంరాజు, శ్రీనివాసరావు, శ్యామ్ ప్రభాకర్, అర్జునరావు, ఆర్.సుబ్బారావు, కోటేశ్వరమ్మ, పీడీ వీరచంద్ర, సర్పంచ్ బోయన వెంకమ్మ, పీసీ ఛైర్మన్ బి.సురేష్, వై.సుబ్బారావు, పి.బసంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● బాపట్లలోని జెమ్స్ ఉన్నత పాఠశాలలో బుధవారం సైన్స్ ఎక్స్‌పో ఏర్పాటు చేశారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్ ప్రారంభించి అక్కడ ఏర్పాటు చేసిన ప్రదర్శనలను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● కర్లపాలెం, ఫిబ్రవరి 28 : కర్లపాలెం హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు స్వామినాథన్ సైన్స్ జాతీయ టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించడటం అభినందనీయమని తహసీల్దార్ నిర్మలానందబాబా అన్నారు. విద్యాశాఖ గీతాయంగ్ సైంటిస్ట్‌వారి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 25 జూనియర్, సీనియర్ విభాగంలో స్వామినాథన్ సైన్స్‌టాలెంట్‌టెస్ట్ నిర్వహించగా జిల్లా వ్యాప్తంగా 25 మండలాలలో 900మంది విద్యార్థులకు ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించారు. జూనియర్,సీనియర్ విభాగాలలో జాతీయ స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు షేక్.జాకీర్, రిత్విక్ హర్ష, యల్.గణేష్, షేక్. సమీర్‌లు సాధించారు. వీరికి తహసీల్దార్ నిర్మలానందబాబా, విద్యాశాఖాధికారిణి నంబూరి విజయశ్రీలు ప్రశంసపత్రాలు, మెడల్ అందించి విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జె.శ్రీనివాసరావు, ఛైర్మన్ పెదమల్లు ఉదయ చంద్రరావు, డైరెక్టర్ సాయి మహేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

● రేపల్లె, ఫిబ్రవరి 28: విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రముఖ వైద్యులు డాక్టర్ వసంతం వీరరాఘవయ్య అన్నారు. శ్రీచైతన్య పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు చేసిన వివిధ రకాల సైన్స్ ప్రాజెక్టులను ఆయన పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రామాంజనేయులు, పాఠశాల డీమ్ ఎన్. నాగ సునీత, ఏవో ఎంవీ రమేస్, రెడ్‌క్రాస్ సభ్యులు కరిముల్లా పాల్గొన్నారు.

స్థానిక భాష్యం పాఠశాలలో జాతీయ వైజ్ఞానిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యార్థులచే 110రకాల భౌతికశాస్త్ర జీవశాస్త్ర, ప్రయోగాలు నమూనాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో జోనల్ అధికారి ఉదయరాజు, హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నగరం, ఫిబ్రవరి 28 : విద్యార్థినీ, విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎస్వీఆర్ఎం ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ అన్నారు. బుధవారం జాతీయ విజ్ఞానం దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పంచుమర్తి శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ పూషడపు వెంకట నారాయణ, ఏవో మాగంటి సుధాకర్, సారథి పాల్గొన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మండలంలోని పెద్దవరం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థినీ, విద్యార్థులు చేసిన ఎగ్జిబిషన్‌ను పలువురిని ఆకట్టుకుంది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.బద్రినాథ్, ఉపాధ్యాయులు లక్ష్మణ్‌రావు, అనురాధ, రాజ్యలక్ష్మీ, ఎస్ఎంసీ ఛైర్మన్ సుబ్బారావు పాల్గొన్నారు.

కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ చట్టం నూతన మార్గదర్శకాలు విడుదల

● జిల్లా మత్స్యశాఖాధికారి డాక్టర్ పి.సురేష్

బాపట్ల, ఫిబ్రవరి 28 : కేంద్రప్రభుత్వం కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీ చట్టం 2005కు 2023 మే 12న సవరణ చేసి దీనికి సంబంధించిన నూతన మార్గదర్శకాలను విడుదల చేసినట్లు జిల్లా మత్స్యశాఖాధికారి డాక్టర్ పి.సురేష్ తెలిపారు. ఆక్వారైతులకు అనుకూలంగా ఉండే నిర్ణయాలు తీసుకోవాలన్నారు. ఈ కొత్తనిబంధనలు జనవరి 9వతేదీ నుంచి అమల్లోకి వచ్చాయన్నారు. ముఖ్యాంశాలు ఆయన వివరించారు.

● ఆక్వాచెరువులో విస్తీర్ణం 5హెక్టార్ల వరకు రెవెన్యూ డివిజనల్ అధికారి అధ్యక్షతన గల సబ్‌డివిజనల్‌కమిటి రిజిస్ట్రేషన్ చేయుటకు కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీకి సిఫార్సు చేయవచ్చు. 5 హెక్టార్ల నీటి విస్తీర్ణం కంటే ఎక్కువ ఉన్న చెరువులు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని జిల్లా స్థాయి కమిటీ కోస్టల్ ఆక్వాకల్చర్ అథారిటీకి సిఫార్సు చేయవచ్చు.

● అసైన్డ్‌భూములు, సొసైటీభూముల్లో ఉన్న చెరువులకు రిజిస్ట్రేషన్ సదుపాయం కల్పించారు. గతంలో పై చట్టం కింద ఉప్పునీటి చెరువులుగా నమోదై కాలపరిమితి అయిపోయిన పాతచెరువులకు తిరిగి లైసెన్స్‌లు పెనాలిటి కట్టి పునరుద్ధరించుకోవచ్చు. ఉప్పునీటి చెరువుల్లో లైసెన్స్‌లు కాగితం పోగొట్టుకున్న వారికి నకలు పొందే సదుపాయం కల్పించబడింది.

● ఆక్వాచెరువులను కొనుగోలు చేసిన రైతుల పేరుమీద లైసెన్స్‌లను బదిలీ చేసుకోవచ్చు. గతంలో అనధికారికంగా ఉప్పునీటి చెరువులు చేస్తున్న రైతులకు లక్షరూపాయలు అపరాధ రుసుం, మూడు సంవత్సరాల జైలు శిక్ష వేసే అవకాశం ఉండేది. ప్రస్తుత చట్టంలో అనధికార ఉప్పునీటి చెరువులు వేస్తే హెక్టారు నీటి విస్తీర్ణంకు రూపాయికి 10వేలు చొప్పున మొదటి తప్పుగా విధించబడును. రెండోవసారి కూడా అదే తప్పు చేస్తే రూపాయికి రూ.15వేలు, మూడోసారి కూడా చేస్తే రూపాయికి రూ.25 వేలు అపరాధరుసుం విధించబడును.

● ఉప్పునీటి రొయ్యపిల్లల లేదా చేపపిల్లల హేచరీల వారు అనధికారికంగా ఉత్పత్తి చేస్తే మొదటి తప్పుగా 50వేల రూపాయలు, రెండోవసారి కూడా తప్పు చేస్తే 75వేల రూపాయలు, మూడోవసారి కూడా తప్పుచేస్తే లక్షరూపాయలు అపరాధ రుసుము విధించబడును. ఈ విషయాలు ఆక్వారైతులకు,కు, హెచరీ యజమానులకు, ఆక్వామందుల షాపుల యజమానులు, ఇతర భాగస్వాములందరికి కూడా అవగాహన కల్పించటం జరుగుతుందన్నారు. మార్చి1వ తేదిన మధ్యాహ్నం 2 గంటలకు కర్లపాలెంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపం నందు అవగాహన సదస్సు ఏర్పాటు చేయటం జరుగుతుందనారు. ఈ కార్యక్రమానికి కోస్టల్ ఆక్వా కల్చర్ ఆథారటి డైరెక్టర్ డాక్టర్ శంకరరావు, మెరైన్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్ట్ డెవలప్‌మెంట్ అథారటి విజయవాడ, నాక్సా అధికారులు పాల్గొని అవగాహన కల్పిస్తారన్నారు. కావున ఆక్వాకల్చర్ భాగస్వాములంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు.

రాష్ట్ర స్థాయి కవితల పోటీలకు ఆహ్వానం

బాపట్ల టౌన్, ఫిబ్రవరి 28 : సాహితీభారతి ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు సాహితిభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. బుధవారం సాహితీభారతి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇతివృత్తం ఏదైన అర పేజి మించి ఉండరాదని ప్రతి ఒక్కరు హామీ పత్రం జత చేసి మార్చి 10వ తేదీలోపు పంపించాలన్నారు కవితల పోటీల విజేతలకు మార్చి 30వ తేదీన జ్ఞాపికలతోపాటు, సర్టిఫికెట్‌లను అందజేస్తారన్నారు. కవితలు పంపించాల్సిన చిరునామా ఆదంషఫి, రచయిత కోశాధికారి సాహితిభారతి, జమేదారుపేట, బాపట్ల-522101, బాపట్ల జిల్లా అనే అడ్రస్‌కు పంపాలన్నారు.

యానిమేటర్లు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

● స్త్రీనిధి ఏజీఎం నాగబాబు

భట్టిప్రోలు, ఫిబ్రవరి 28 : యానిమేటర్లు విధి నిర్వహణలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్త్రీనిధి ఏజీఎం నాగబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం యానిమేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి రుణాలు ఎవరి పేరున దరఖాస్తు చేశారో వారికి మాత్రమే నిధులు అందేలా చూడాలన్నారు. డ్వాక్రా మహిళలు చెల్లించే అన్ని రకాల రికవరీలు సకాలంలో చెక్కుల ద్వారా చెల్లింపు లు జరపాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా కేంద్ర ఏపీఎం మాచవరపు రమేష్‌బాబు మాట్లాడుతూ పాడి పరిశ్రమ, కుట్టు మిషన్ల మీద జీవనోపాధి సాగించే లబ్ధిదారులను గుర్తించి పాడిగేదెలు, కుట్టు మిషన్లు ఇప్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఏరియా కోఆర్డినేటర్ పి.రమాదేవి, ఏపీఎం జి.శ్రీమన్నారాయణ, మండల సమాఖ్య అధ్యక్షురాలు జాలా ది ధనలక్ష్మి, మేనేజర్ పిల్లి అశోక్‌బాబు, అకౌంటెంట్ శిరీష, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహాల గ్రామోత్సవం

భట్టిప్రోలు, ఫిబ్రవరి 28 : స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానం వీధిలో గల సీతారామ మందిరంలో హనుమత్ లక్ష్మణ సీతా సమేత రామచంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ప్రతిష్ఠామూర్తులకు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం గ్రామ పురవీధుల్లో గ్రామోత్సవం అనంతరం మహాశాంతి హోమాన్ని నిర్వహించారు. మండలంలోని వెల్లటూరులో నూతనంగా నిర్మించిన కోదండరామస్వామి వారి దేవాలయ పునఃప్రారంభోత్సవం, నూతన విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం విగ్రహాల ప్రతిష్ఠ అనంతరం ధ్రువ కల్యాణాన్ని జరిపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అన్న ప్రసాద వితరణ జరుగుతుందని ఆయా గ్రామాల అభివృద్ధి కమిటీ సభ్యులు చెప్పారు.

పేద మహిళకు జనసేన ఆర్థిక సాయం

చుండూరు, ఫిబ్రవరి 28 : పేద మహిళకు జనసేన పార్టీ నాయకులు బుధవారం ఆర్థిక సాయం అందించారు. మోదుకూరుకు చెందిన కాసా లక్ష్మీకి వివిధ కారణాలతో భర్త, మామ ఇటీవల కాలంలో మృతి చెందారు. తోడుగా ఉంటుందనుకుంటున్న అత్త మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. నా అనే వారు లేని ఆ బాధితురాలికి గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు పోకల శ్రీనివాసరావు రూ.10వేలు ఆర్థిక సాయం అందించి అండగా నిలిచారు.

మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

అమృతలూరు, ఫిబ్రవరి 28: మతి స్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. మండల పరిధిలోని తెనాలి-చెరుకుపల్లి ప్రధాన రహదారిలో గోవాడ-చెరుకుపల్లి మధ్య ఆర్‌అండ్‌బీ రహదారికి సమీపంలోని కాల్వ గట్టుపై పురుగుల మందు తాగి బి.వీరాచారి (45) ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. చెరుకుపల్లి మండ లం యేమినేనివారిపాలేనికి చెందిన వీరాచారికి మతిస్థిమితం ఉండదని, చెరుకుపల్లిలో వైద్యశాలకు వెళుతున్నట్లు ఇంటి వద్ద చెప్పి వచ్చినట్లు తెలిపారు. భార్య పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు. మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాలకు తరలించా రు. మృతదేహాన్ని, సంఘటన స్థలంలో చుండూరు సీఐ సీహెచ్‌ఎల్ఎన్ శ్రీనివాసరావు పరిశీలించారు.

నేటి నుంచి టీడీపీ, జనసేన సర్వసభ్య సమావేశాలు

వేమూరు, ఫిబ్రవరి 28: నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రెండు రోజుల పాటు ఉమ్మడి తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ సర్వసభ్య సమావేశాలు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ప్రతినిధులు తెలిపారు. గురువారం ఉదయం 10 గంటలకు కొల్లూరులోని ఎంప్లాయిస్ రిక్రియేషన్ క్లబ్‌లో, మధ్యాహ్నం మూడు గంటలకు వేమూరులోని టీడీపీ కార్యాలయంలో, శుక్రవారం ఉదయం 10గంటలకు భట్టిప్రోలులోని టీడీపీ కార్యాలయంలో, సాయంత్రం నాలుగు గంటలకు అమృతలూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో రెండు పార్టీల సర్వసభ్య సమావేశం జరుగుతాయన్నారు. మాజీ మంత్రి నక్కా ఆనందబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. సమావేశాలకు నాలుగు మండలాల పరిధిలోని టీడీపీ జనసేన నాయకులు, కార్యకర్తలు అనుబంధ సంఘాల నాయకులు క్లస్టర్ బూత్ యూనిట్ ఇన్‌చార్జిలు హాజరై జయప్రదం చేయాలని కోరుతున్నారు.

టీడీపీతో మారనున్న మహిళల భవిష్యత్తు : గూడపాటి

రేపల్లె, ఫిబ్రవరి 28: మహాశక్తితో రాష్ట్ర మహిళల భవిష్యత్తు పూర్తిగా మారనున్నదని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం 14, 15వార్డుల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ పట్టణ అధ్యక్షుడు గోగినేని పట్టాభి రామారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గూడపాటి మాట్లాడుతూ మహాశక్తి పథకం కింద ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500, తల్లికి వందనం కింద సంవత్సరానికి రూ.15వేలు ప్రతి ఏటా మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగా అందించటంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామన్నారు. ఎమ్మెల్యే సోదరుడు అనగాని శివప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో మొదట్నించి మహిళలకు పెద్ద పీట వేసింది చంద్రబాబు అనే తెలిపారు. రాష్ట్రంలో వ్యవస్థలన్నీ జగన్మోహన్‌రెడ్డి విచ్ఛిన్నం చేశారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్నె సుధ, పరుచూరి విజయ్‌కుమా ర్, పంతాని సాయికుమార్, టి.మల్లికార్జున్‌రావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, యలవర్తి లక్ష్మీ, దున్నా జయప్రద, పిన్నిబోయిన లక్ష్మీనరసింహ, నాగశ్రీ, ల్యాబ్‌కిషోర్, ఆగస్త్యశాస్త్రి, డొక్కు బుజ్జి, దేవగిరి రంగా, మద్దుల అంకాలు పాల్గొన్నారు.



ఇంటింటికి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

చీకటి జీవోను రద్దు చేయాలి : న్యాయవాది ఆళ్ల

రేపల్లె, ఫిబ్రవరి 28: ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైటలింగ్ చట్టాన్ని ప్రభుత్వం పునరాలోచించి తీసివేయాలని న్యాయవాది ఆళ్ళ సూరిబాబు అన్నారు. న్యాయవాదులు చేస్తున్న రిలే దీక్షలు బుధవారానికి 52వ రోజుకు చేరాయి. వడ్లమూడి కృష్ణమోహన్‌రావు, పుష్పాల ఐజ్, ఆరేపల్లి కొండలరావు, కేసన జగదీస్, సమ్మెట శ్రీనివాసరావు, సంఘీభావం తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అసోసియేషన్ సభ్యులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టైటలింగ్ చట్టం 27/22ను రద్దు చేయకుంటే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. దీక్షా శిబిరంలో న్యాయవాదులు ఏ మధుసూదన్‌రావు, ఎం సుబ్బారావు, పి.భూషణం, కె.వీరరాఘవులు ఉన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఆరేపల్లి మధుసూదన్‌రావు, దారం సాంబశివరావు, పి.భూషణం, జీ.రామారావు, పి.వెంకటసుబ్బారా వు, జీవీ శివయ్య, సిహెచ్ శ్రీనివాస్‌మూర్తి పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరపాలి

● ఎన్నికల అధికారి వసంతరాయుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి వసంతరాయుడు, డీఎస్పీ మురళీకృష్ణ

వేమూరు, ఫిబ్రవరి 28 : నియోజకవర్గంలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి వసంతరాయుడు కోరారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం భవనంలో డీఎస్పీ మురళీకృష్ణతో కలసి మండలాల వారీగా పోలీసులు శాఖతో పాటు ఇతర శాఖల అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల అధికారి ఐదు మండలాల పరిధిలోని సమస్యాత్మక అత్యంత సమస్యాత్మక గ్రామాల నివేదికలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఉండాలని, ఆయా కేంద్రాల పరిధిలోని ఓటర్లతో పలు సమావేశాలు ఏర్పాటు చేసి ఎన్నికల విషయంపై అవగాహన కల్పించారు. డీఎస్పీ మురళీకృష్ణ గ్రామాల వారీగా సిద్ధం చేసిన రూట్ మ్యాప్‌లు తమ సిబ్బందికి సంబంధించిన నియామకాల విషయంలో ముందస్తుగా తీసుకోవలసిన చర్యలను వివరించారు. సమావేశం లో నియోజకవర్గ ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, వేమూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, చుండూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, వేమూరు, అమర్తలూరు, చుండూరు, భట్టిప్రోలు తహసీల్దార్లు, కిరణ్ కవిత, బాలాజీ, విశ్వనాథ్, పద్మావతి ఎస్సైలు రాజశేఖర్, నవీన్, రవీంద్రారెడ్డి, శ్రీనివాస్, షేక్ రఫీ దైట మండలాల పరిధిలోని వివిధ శాఖల అధికారులు, పోలీసుశాఖ వివిధ విభాగాలలోని సిబ్బంది హాజరయ్యారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రేపల్లె, ఫిబ్రవరి 28: విద్యుత్ మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్‌శాఖ ఏడీఈ భాస్కరరావు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రూరల్ మండలంలోని 33/11కేవీ పోటుమెరక, గంగడిపాలెం, లంకేవానిదిబ్బ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నిర్వహిస్తారన్నారు. ఈ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారని వినియోగదారులు సహకరించాలని కోరారు.

పల్స్ పోలియోపై అవగాహన

కొల్లూరు, ఫిబ్రవరి 28: పల్స్ పోలియో కార్యక్రమంపై ఇటుక బట్టీల్లోని మహిళా కూలీలకు వైద్యురాలు రామలక్ష్మి అవగాహన కల్పించారు. బుధవారం కొల్లూరు మండలపరిధిలోని పోతార్లంక, తోకలవానిపాలెం, కిష్కిందపాలెం పరిధిలో విస్తరించి ఉన్న 30 ఇటుక బట్టీల్లోని మహిళా కూలీల పిల్లలకు పోలియో చుక్కల ఆవశ్యకతను వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు వివరించారు. మార్చి 3వ తేదీ ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా చిన్నారులందరికి పోలియో చుక్కలనుదగ్గరలోని పోలియోకేంద్రం వద్ద వేయించుకోవాలన్నారు. సంచార కేంద్రం కూడా ఏర్పాటు చేశామని అక్కడ కూడా పోలియో చుక్కలు వేస్తారన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

రేపల్లె, ఫిబ్రవరి 28: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ఫ్యాషన్ డిజైన్ ఎంతగానో దోహదపడుతుందని ప్రవాసాంధ్రులు పుట్టగుంట వేణుగోపాలరావు అన్నారు. బుధవారం మెడికల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల స్వయం ఉపాధి కోసం ఉపయోగిస్తున్న ఫ్యాషన్ డిజైన్ శిక్షణను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సేవా కార్యక్రమంతో మహిళలకు చేయూతనందిచేందుకు తమవంతు ఆర్థిక సాయాన్ని చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పరుచూరి శ్రీను, రమేష్, సాయిప్రసాద్, ముమ్మలనేని గోపాలరావు పాల్గొన్నారు.

ఐటీఐ విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేత

రేపల్లె, ఫిబ్రవరి 28: ఐటీఐ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ నెమలికంటి భాస్కరరావు అన్నారు. బుధవారం స్థానిక శారదా కళాశాల నందు ప్రముఖ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ అయినటువంటి ఇన్స్పైర్ ఇండియా వారిచే విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. శిక్షణలో రాణించిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ బడుగు శారద, కరస్పాండెంట్ వెంకటనారాయణ, జ్యోత్స్నా, మేరుగ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల వేలంపై విచారణ

చుండూరు ఫిబ్రవరి 28 : వలివేరులోని శ్రీలలిత స్వయంభూవేశ్వర స్వామి దేవాలయ భూముల వేలం పాటల్లో జరిగిన అవకతవకలపై విచారణ చేపట్టాలని దేవాలయ డీసీ ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల ఈ దేవాలయానికి చెందిన 54 ఎకరాల భూములకు సంబంధించిన కౌలు వేలంపాటలో పెద్ద ఎత్తున అవకతవకలు జరిగాయని ఫిర్యాదు అందడంతో వాటిపై విచారణ చేపట్టవలసినదిగా తెనాలి దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు డీసీ ఆదేశాలు జారీ చేశారు.


ఎన్టీఆర్ వారిధిపై కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న నేత ఏలూరి

- రొంపేరు బ్రిడ్జిపై ఎన్టీఆర్‌వారధి నిర్మించి ఐదేళ్లు
- కేక్ కట్ చేసి టీడీపీ నేతల హర్షం

చినగంజాం, ఫిబ్రవరి 28 : పెదగంజాం గ్రామ ప్రజలకు ఎన్నికలలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ప్రజానేతగా చరిత్రలో టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నిలిచారని తెలుగురైతు రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి ఆసోది సుబ్బారెడ్డి, మండల అధ్యక్షులు పొద వీరయ్యలు అన్నారు. మండలంలోని పెదగంజాం, రాజుబంగారుపాలెం గ్రామాల మధ్య గల రొంపేరు కాలువపై ఎన్టీఆర్ వారిధి నిర్మించి ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఎన్టీఆర్ వారిధి వద్ద బుధవారం మండల టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి, కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ పెదగంజాం గ్రామస్థులకు ఇచ్చిన హామీ మేరకు కట్టుబడి రొంపేరుపై బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసిన తర్వాతనే బ్రిడ్జిపై నడుచుకుంటూ వచ్చి మిమ్ములను ఓట్లు అడుగుతానని మాట ఇచ్చిన ఎమ్మెల్యే ఏలూరి ఆ మాట నిలబెట్టుకున్నారని అన్నారు. పెదగంజాం ప్రజల దశాబ్దాల చిరకాల వాంఛ నెరవేర్చి 2019 ఎన్నికల్లో బ్రిడ్జిపై నడుచుకుంటూ వెళ్లి ఓట్లు అడిగారని అన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోనికి వచ్చి ఐదు సంవత్సరాలు పూర్తి అవుతున్నా ఎన్టీఆర్ వారిధికి ఇరువైపుల కనీసం పూర్తి స్థాయిలో రోడ్డు వేయలేక పోయారని అన్నారు. కార్యక్రమంలో పర్చూరు నియోజకవర్గ యూనిట్ ఇన్‌చార్జ్ కొల్లా సుబ్బారాయుడు, చినగంజాం గ్రామ సర్పంచ్ రాయని ఆత్మారావు, నాయకులు కోకి భాస్కర్‌రెడ్డి, సందు శ్రీనివాసరావు, కోడూరి శ్రీనివాసరావు, వడ్లమూడి సత్యనారాయణ, అబ్దుల్ కలాంఅజాద్, బోగిరెడ్డి కోటిరెడ్డి, అద్దూరి వెంకటేశ్వర్లు, గడ్డం కోటయ్య, మండల ఐటీడీపీ అధ్యక్షులు రామాంజనేయరెడ్డి, పెదగంజాం గ్రామ పార్టీ అధ్యక్షులు అంజిరెడ్డి, గొనసపూడి గ్రామ ఉపసర్పంచ్ వీరాస్వామి, పలు గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బలరాం, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

పేదలకు భరోసా కల్పించటమే లక్ష్యం

- ఎమ్మెల్యే బలరాం

చీరాల, ఫిబ్రవరి 28 : పేదలకు అన్ని విధాల భరోసా కల్పించటమే సీఎం జగన్ ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగా పార్టీలకు అతీతంగా అర్హతే ఆధారంగా లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌లు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం నవరత్నాలు, పేదలందరికీ ఇళ్లలో భాగంగా 534 మందికి నివేశన స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను, సంపూర్ణ దళితహక్కు పథకం కింద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 144 మందికి మంజూరైన ధ్రువీకరణ పత్రాలను బలరాం, వెంకటేష్‌లు లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్జున్‌నాయక్, తహసీల్దార్ నాసరయ్య, ఎంపీడీవో శోభారాణి, మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బొనిగల జైసన్‌బాబు, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ డైరెక్టర్ గవిని శ్రీనివాసరావు, నాయకులు అంకాళరెడ్డి, బొడ్డు సుబ్బారావు, ఎస్. రాజ్‌కుమార్, నాదెండ్ల కోటేశ్వరరావు, బండారు శివ పార్వతి, కావూరి రమణారెడ్డి, ఎరిపిల్లి రమణ, గుంటూరు వెంకట సుబ్బారావు, షేక్ మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.


వైజ్ఞానిక దృక్పథం గ్రంథాన్ని ఆవిరిస్తున్న ఉపాధ్యాయులు

వైజ్ఞానిక దృక్పథాన్ని పెంచుకోవాలి

ఇంకొల్లు,ఫిబ్రవరి 28:విద్యార్థులు వైజ్ఞానిక దృక్పథాన్ని పెంచుకోవాలని ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవం సందర్భంగా వైజ్ఞానిక సభ నిర్వహించారు.ఈ సందర్భంగా మేడూరి సత్యనారాయణ రచించిన వైజ్ఞానిక దృక్పథం గ్రంథాన్ని ఆదినారాయణ ఆవిష్కరించారు. ఇంకొల్లులో ఎంఆర్ఆర్,నివేదిత హైస్కూల్,ఆదర్శ హైస్కూల్‌లో సైన్సుడే సందర్భంగా వివిధ నమూనాలను ప్రదర్శించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయసిబ్బంది పాల్గొన్నారు.

గుండ్లకమ్మ గుల్లగుల్ల

అక్రమంగా ఇసుక తవ్వకాలు

బ్రిడ్జికి ఇరువైపులా ఇష్టారీతిన తవ్వకాలు...

బ్రిడ్జి, మంచినీటి, ఎత్తిపోతల పథకాలకు ముప్పు

అద్దంకి, ఫిబ్రవరి 28: అద్దంకి ప్రాంతంలోని గుండ్లకమ్మ నదిలో యథేచ్ఛగా ఇసుక అక్రమ తవ్వకాలతో గుల్లగుల్లగా మారుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా అద్దంకి-దర్శి రోడ్డులో గుండ్లకమ్మ నదిపై ఉన్న బ్రిడ్జికి ఇరువైపులా ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. నిన్న మొన్నటి వరకు పంటల సాగు కు జరిగిన ఆక్రమణల పర్వం ప్రస్తుతం ఇసుక తవ్వకాలకు అడ్డాగా మారింది. పంటలసాగు చేసుకుంటూ ఆక్రమించుకున్న వారికి ఎంతోకొంత చేతిలో పెట్టి ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ పరిధి బ్రిడ్జి వరకు ఉన్నా ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇక ఏకంగా రిజర్వాయర్ పరిధిగా ఉన్న తమ్మవరం, మణికేశ్వరం, అనమనమూరుల వద్ద కూడా తవ్వకాలు సాగుతున్నాయి.

ఇక అద్దంకి పట్టణానికి సమీపంలో బ్రిడ్జికి ఇరువైపులా ఇసుక తవ్వకాలు చేస్తుండటంతో అసలే అంతంత మాత్రంగా ఉండి శిథిలావస్థలో ఉన్న బ్రిడ్జికి అత్యంత సమీపం వరకు ఇసుక తవ్వకాలు చేస్తుండటంతో ఏ సమయంలో ఏ రూపంలో ప్రమాదం పొంచి ఉంటుందోనన్న ఆందోళన నెలకొంది. ఇక ఎత్తిపోతల పథకాల వద్ద కూడా ఇసుక తవ్వకాలు జరుగుతుండటంతో నీటి నిల్వ ఉండే అవకాశం లేకుండా పోతుందన్న ఆందోళన రైతులలో నెలకొంది. ఇక అద్దంకి పట్టణంతో పాటు పలు గ్రామాలకు మంచినీటిని సరఫరా చేసే ఊటబావుల చెంత కూడా ఇసుక తవ్వకాలు ఇష్టారీతిన జరుగుతున్నాయి. ఇక మంచినీటి పైప్‌లైన్‌లు కూడా పగిలిపోతున్నాయి. ఇలా అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నప్పటికీ అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవటం పలు విమర్శలకు తావిస్తోంది.


గుండ్లకమ్మ నదిలో బ్రిడ్జికి రెండు వైపులా జరుగుతున్న ఇసుక తవ్వకాలు

స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించాలి

బాపట్ల ఆర్డీవో రవీందర్


అధికారులకు సూచనలు ఇస్తున్న బాపట్ల అర్‌డీవో రవీందర్

పర్చూరు, ఫిబ్రవరి 28: ఎలాంటి ఇబ్బందులకు తావులేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలను నిర్వహించాలని, అందుకు అధికారులు సంసిద్ధం కావాలని పర్చూరు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జి.రవీందర్ అన్నారు. బుధవారం స్థానిక రాజ్యలక్ష్మి కల్యాణ మండపంలో ఆర్‌డీవో అధ్యక్షతన పర్చూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని సెక్టార్, ఫ్లయింగ్ స్క్వాడ్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారులు, వ్యయ పరిశీలకు, వివిధ టీం పోలీసు అధికారులకు త్వరలో జరగనున్న ఎన్నికలకు సంబంధించి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించటమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలన్నారు. ఎలాంటి అసాంఘిక చర్యలకు తావులేకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల విధుల నిర్వహణకు కేటాయించిన అధికారులు ఎలాంటి నిర్లక్ష్య వైఖరి అవలంబించినా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలన్నారు. ఈకార్యక్రమంలో పర్చూరు తహసీల్దార్ సీహెచ్.సుబ్బయ్య, మార్టూరు కె.సంధ్యశ్రీ, యద్దనపూడి వై.నాగరాజు, ఇంకొల్లు ఎం.ప్రమీల, చిన్నగంజాం జీవీఎస్.ఫణీంద్ర బాబు, కారంచేడు మెహర్‌బాబు, బాపట్ల డీఎస్పీ మురళీకృష్ణ, చీరాల డీఎస్పీ బి.ప్రసాద్, ఇంకొల్లు బి.శ్రీనివాసరావు, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ పి.సూర్య నారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలపై మంచు దుప్పటి

పొగ మంచుతో ప్రజల ఇబ్బందులు

ఉదయం 10 గంటల వరకు కనిపించని రోడ్లు

ఈ ఏడాదికి ఇంతలా ఎప్పుడూ లేదంటున్న ప్రజలు

బల్లికురవ. ఫిబ్రవరి 28 : మండలంలోని పలు గ్రామాలను బుధవారం మంచు దుప్పటితో కప్పేసింది. తెల్లవారిన తరువాత పొగ మంచు ఎక్కువ అయి ఉదయం పది గంటల వరకు రోడ్లు కనిపించకుండా పడటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వాహనాల డ్రైవర్లు అయితే లైట్లు వేసుకొని నెమ్మదిగా ప్రయాణం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది కాలానికి ఇప్పుడు కురిసినంత మంచు ఎప్పుడూ కురవదలేదని ప్రజలు చర్చించుకున్నారు.

బల్లికురవ మండలంలోని పలు గ్రామాల్లో పొగ మంచు వర్షాన్ని తలపించేలా పడింది. దీంతో రోడ్లు కూడా కనిపించలేదు. రెండు అడుగుల దూరంలో ఉన్న వారు కూడా ఒకరికి ఒకరు కనిపించలేదు. బల్లికురవ- అద్దంకి రోడ్డు మంచు దుప్పటిలా మారటంతో వాహనాలపై వచ్చే ప్రజలు భయం భయంగా ప్రయాణం సాగించారు. కొద్దిపాటి దూరం బైకులపై ప్రయాణం చేస్తే దుస్తులు కూడా మంచుతో తడిచి పోయాయి. అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలో అయితే మంచుతో రహదారి కనిపించక భారీ వాహనాలను డ్రైవర్లు కొద్ది సేపు నిలుపుదల చేసి తరువాత వెళ్లారు. సూర్యుడు కనిపించక పోవటంతో ప్రజలు ఎండ కోసం ఎదురు చూపులు చుశారు. వేసవి కాలం వస్తున్న తరుణంలో పొగ మంచు ప్రభావంతో మరింత ఎండలు పెరిగే అవకాశం ఉంటుందని పలువురు తెలిపారు.


రహదారిని కమ్మేసిన పొగమంచులో లైట్లు వేసుకొని వస్తున్న వాహనం


ఉదయం పది గంటల సమయంలో ముంచు దుప్పట్లో బల్లికురవ ప్రాంతం

సమస్యలను గుర్తించాలని టైలర్ల ర్యాలీ

మార్టూరు, ఫిబ్రవరి 28: రాష్ట్ర ప్రభుత్వం టైలర్ల సమస్యలను పరిష్కరించాలని మండల టైలర్ల సంఘం అధ్యక్షులు పఠాన్ ఖాదర్ వలి అన్నారు. బుధవారం టైలర్ల దినోత్సవం సందర్భంగా మార్టూరు ఉదయం సెంటర్లో టైలర్ల జండాను ప్రయివేటు వైద్యులు తుర్లపాటి శ్రీనివాసరావు ఎగుర వేశారు. అనంతరం సెంటరు నుంచి విశ్రాంత ఉద్యోగుల భవనం వరకు ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించాలని ర్యాలీ నిర్వహించారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన సభలో పలువురు టైలర్లు సమస్యలపై మాట్లాడారు. తరువాత సీనియర్ టైలర్ పఠాన్ ఖాదర్ వలిని టైలర్లు శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో రావుల బాపయ్య, తగెడ్ల ఆంజనేయులు టైలర్లు ఖాజావలి,యం. బాల నాగేశ్వరి, హుస్సేన్, ఆదిల్ వలి, లక్ష్మి, సుభాని, రజియా, ఇందు, సుభాని, కాలేషా, యం పోతురాజు, బి. పౌల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టైలర్స్ దినోత్సవం

ఇంకొల్లు : స్థానిక రోటరీక్లబ్ భవనంలో శ్రీమాత మహిళా సేవా సంఘం ఆధ్వర్యంలో టైలర్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు.గ్రామంలో ర్యాలీ నిర్వహించారు టైలరింగ్ వృత్తిలో కొనసాగుతూ పలువురు మహిళలను తీర్చిదిద్దిన ఇంకొల్లుకు చెందిన షేక్ నసీంను సత్కరించారు.

వేడుకగా వరసిద్ధి వినాయకస్వామి ఆలయ ప్రతిష్ఠ

పూజా కార్యక్రమాలలో పాల్గొన్న భక్తులు

బల్లికురవ. ఫిబ్రవరి 28 : బల్లికురవ గ్రామస్థుల సమష్టి కృషితో నూతనంగా నిర్మించిన వర సిద్ధి వినాయకస్వామి దేవాలయ వాయు ప్రతిష్ట బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రతిష్టాచార్యులు కొప్పరపు సుబ్బయ్య పర్యవేక్షణలో వేద పండితులు ఈ కార్యక్రమం ఉదయం 10 గంటలకు నిర్వహించారు. మూడు రోజుల నుంచి జరుగుతున్న పూజ కార్యక్రమాలు ప్రతిష్ఠతో ముగిశాయి. సుమారు రూ.35 లక్షల ఖర్చు చేసి గ్రామస్థులు దాతల సహకారాన్ని తీసుకొని వర సిద్ధి వినాయక స్వామి దేవాలయాన్ని నిర్మించారు. దేవాలయ ప్రతిష్ఠతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ఈసందర్భంగా దేవాలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ప్రతిష్ఠలో భాగంగా దేవాలయ నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నదానాన్ని నిర్వహించారు.


బల్లికురవలో వరసిద్ధి వినాయకుడిని ప్రతిష్ఠిస్తున్న భక్తులు, వేద పండితులు

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

మార్టూరు, ఫిబ్రవరి 28: ప్రతి విద్యార్థి సైబర్ నేరాలపై, డిజిటల్ పేమెంట్ల నిర్వహణపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ రాజ శేఖర్ అన్నారు. బుధవారం మార్టూరులోని శ్రీ హర్షిణి డిగ్రీ కళాశాలలో డిగ్రీ విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక అక్షరాస్యతా వారోత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా బ్యాంకు మేనేజరు రాజశేఖర్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి విద్యార్థి బ్యాంకు అకౌంట్‌ను తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.విద్యార్థులు డబ్బుల కోసం మొబైల్ లోన్‌యాప్ ద్వారా ఆన్‌లైన్ లోన్‌లు తీసుకుంటున్నారని, తద్వారా ఇబ్బందులలో పడతారన్నారు. వాటిని తీర్చలేక ఆర్థిక ఇబ్బందులకు గురై ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థులు కూడా ఉన్నారన్నారు. అందువలన వాటి జోలికి వెళ్ల వద్దన్నారు. ఒక వేళ ఆన్ లైన్ మోసాలకు గురయినట్లయితే 1930 టోల్ నంబరుకు కాల్ చేసి సమీపంలోని బ్యాంకు మేనేజరును కలవాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారి దేవరకొండ ప్రవీణ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం ఆంజనేయులు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.సురేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై అవగాహన కలిగిస్తున్న కెనరా బ్యాంక్ మేనేజరు రాజశేఖర్

ఆలోచనా శక్తిని పెంచేందుకు ఎగ్జిబిషన్లు దోహదం

చీరాల , ఫిబ్రవరి 28 : విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించేందుకు సైన్స్ ఎగ్జిబిషన్లు ఎంతగానో దోహదపడతాయని డాక్టర్ ప్రశాంత్ అన్నారు. స్థానిక టీటీడీ కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న శ్రీగౌతమి విద్యాసంస్థల్లో బుధవారం సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించారు. డాక్టర్ ప్రశాంత్ ముఖ్యఅతిథిగా హాజరై సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. విద్యాసంస్థల ఎండీ ఎం. వెంకటేశ్వర్లు(ఎంవీ), ప్రిన్సిపల్ రూఫస్‌లతో కలసి ఆయన విద్యార్థులు తయారు చేసిన ప్రయోగ నమూనాలను పరిశీలించారు. కార్యక్రమంలో శ్రీగౌతమీ విద్యాసంస్థల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


శ్రీగౌతమి విద్యాసంస్థల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రశాంత్, పక్కన ఎండీ ఎం.వీ, ప్రిన్సిపల్ రూఫస్

సైన్స్ ప్రయోగాలపై ఆసక్తిని పెంచుకోవాలి

అద్దంకిటౌన్ : సైన్స్ ప్రయోగాల పట్ల విద్యార్థులు ఆసక్తిని పెంచుకుని ఆ రంగంలో ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్ఐ డి. రత్నకుమారి అన్నారు. బుధవారం అద్దంకి పట్టణంలోని భాష్యం స్కూల్‌లో జాతీయ సైన్స్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్ఐ డి. రత్నకుమారి హాజరై విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రయోగాలను పరిశీలించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జీవీఎల్ శాస్త్రి, హెచ్ఎం కాకాని కల్పన, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని కట్టకిందపాలెం ప్రాథమిక పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు వివిధ అంశాలకు సంబంధించి సైన్స్ ప్రయోగాలను తయారు చేశారు. ఈప్రయోగాలను ఎంఈవో బి. సుధాకరరావు ముఖ్య అతిగా హాజరై పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం సుబ్బారావు, కాంప్లెక్స్ చైర్మన్ కె. శ్రీనివాసరావు, ఎస్ఎంసీ చైర్మన్ సలీమ, సీఆర్‌పీ పుణ్యవతి, ఉపాధ్యాయురాలు సందిరెడ్డి శ్యామలదేవి, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

5న బీసీల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయండి


మార్టూరు టీడీపీ కార్యాలయం వద్ద మాట్లాడుతున్న నాయకులు కామినేని జనార్దన్

మార్టూరు, ఫిబ్రవరి 28: టీడీపీ ఆధ్వర్యంలో వచ్చే నెల 5 వతేదీన చిన గంజాం లోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో జరగనున్న బీసీల ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని మండల పార్టీ నాయకులు కామినేని జనార్దన్ కోరారు. బుధవారం సాయంత్రం మార్టూరులో పార్టీ కార్యాలయం వద్ద మండల బీసీ టీడీపీ నాయకులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చినగంజాంలో జరగనున్న బీసీ నాయకుల సమావేశంపై చర్చించారు. తెలుగుదేశం పార్టీకి వెన్నెముకైన బీసీలు అధిక సంఖ్యలో తరలివచ్చే విధంగా అందరూ కృషి చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, తన్నీరు బోదయ్య నక్కా రాఘవులు, వాటపల్లి ఏడుకొండలు, కొక్కిలిగడ్డ రామాంజనేయులు, వర్లమూడి వెంకయ్య, నరహరి శ్రీనివాసరావు, సురేష్, పోలూరి సింగయ్య గుంజి వెంకట్రావు, ముక్తిపాటి పర్వతాలు, గొట్టిపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

హైస్కూల్ పేరు మార్పుపై విచారణ

వేటపాలెం(చీరాల),ఫిబ్రవరి 28 : మండలంలోని పందిళ్లపల్లి హైస్కూల్ ఎప్పుడెప్పుడు ఏ పేరుతో ఉంది. పేరు మార్పునకు కారణాలు. అందుకు సంబంధించి ఆ పాఠశాల పూర్వవిద్యార్థుల ఫిర్యాదుపై డిప్యూటీ డీఈవో ఆర్. శ్రీనివాసరావు బుధవారం విచారణ నిర్వహించినట్లు తెలిసింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉపాధ్యాయుడికి ఏపీటీఎఫ్ నేతల సత్కారం


కోటవారిపాలెంలో ఉపాధ్యాయుడిని సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

బల్లికురవ. ఫిబ్రవరి 28 : మండలంలోని కోటవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ముకిరి పుష్పరాజ్ ఉద్యోగ విరమణ సందర్భంగా అయనను మండల ఏపీటీఎఫ్ సంఘ నేతలు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు అమృతపూడి శేఖర్ బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిలో విశేష సేవలు అందించిన పుష్పరాజ్ మాస్టర్ సేవలు అభినందనీయం అన్నారు. అనంతరం పాఠశాలలో అభినందన సభ నిర్వహించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు గోలి శ్రీనివాసరావు, జోహార్, కోటయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

6న మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం

అద్దంకిటౌన్, ఫిబ్రవరి 28: అద్దంకి మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం మార్చి 6 న ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో మండల పరిషత్ అధ్యక్షురాలు అవిశన జ్యోతి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో జీవీ సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

దుద్దుకూరులో ప్రత్యేక పూజలు


పూజలో పాల్గొన్న గ్రామస్థులు

దుద్దుకూరు(ఇంకొల్లు),ఫిబ్రవరి 28: మండలంలోని దుద్దుకూరు గ్రామంలో శ్రీచెన్నకేశవ స్వామి ఆలయ జీర్ణోద్ధరణలో భాగంగా బుధవారం రాత్రి ఆలయప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.దేవతా మూర్తులను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. దేవతా మూర్తుల విగ్రహాలను బాలాలయంలో ప్రతిష్ఠించేందుకు ప్రముఖ వేదపండితులు నారాయణ రమణాచార్యులు వారి రుక్విత్ బృందం నేతృత్వంతో హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు,గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ అత్యవసర సమావేశం

చీరాల,ఫిబ్రవరి 28 : స్థానిక మున్సిపల్ కార్యాలయ కౌన్సిల్ హాల్లో గురువారం ఉదయం 11 గంటలకు చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం జరుగుతుందని కార్యాలయ ప్రతినిధులు బుధవారం తెలిపారు. సమావేశానికి కౌన్సిలర్లు, కోఆప్షన్‌సభ్యులు, సంబంధిత అధికారులు హాజరుకావాలని వారు కోరారు.

దగ్గుబాడులో నేత్రదానం

ఇంకొల్లు,ఫిబ్రవరి 28: ఇంకొల్లు రోటరీ అవయదానకమిటీ ఆధ్వర్యంలో దగ్గుబాడులో బుధవారం నేత్రదానం జరిగింది. గ్రామానికి చెందిన చలిచం కోటేశ్వరరావు(84) మృతి చెందగా కుటుంబసభ్యుల సహకారంతో గుంటూరు శంకర కంటి వైద్యులు మృతిని నేత్రాలను సేకరించారు. నేత్రదానంకు సహకరించిన మృతుని కుటుంబసభ్యులను రోటరీఅవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, అధ్యక్ష కార్యదర్శులు కరి కమలేశ్వరరావు,జెట్టి స్వామి అభినందించారు.

బైక్‌ను ఢీకొని చోదకుడు మృతి


తేళ్ల శేషగిరి

మార్టూరు, ఫిబ్రవరి 28: జాతీయ రహదారిపై మండల పరిధిలో గుంటూరు వైపు బొల్లాపల్లి టోల్ ప్లాజాకు సమీపంలో ముందు వెళుతున్న ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొని ద్విచక్రవాహనదారుడు తేళ్ల శేషగిరి (40) తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో మృతిచెందాడు.ఈ సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. మృతుడు శేషగిరిది కొరిశపాడు గ్రామం. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని పోలీసులు తెలిపారు. వ్యక్తిగత పనులు నిమిత్తం కోనంకి గ్రామానికి వస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలిసింది. మృతుని భార్య దివ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈవీఎంలపై అవగాహన


ఇంకొల్లులో ఈవీఎంలపై అవగాహన కలిగిస్తున్న సిబ్బంది

ఇంకొల్లు,ఫిబ్రవరి 28: రానున్న ఎన్నికల దృష్ట్యా మండలంలోని ఇంకొల్లు, గంగవరం,గొల్లపాలెం గ్రామాలలో ప్రజలకు ఈవీఎంలపై అవగాహన కలిగించారు. ఈవీఎంల ద్వారా తమ ఓటు హక్కును ఏవిధంగా వినియోగించుకోవాలో వివరించారు. వీఆర్వో కృష్ణప్రసాద్, రేణుక, ఏఎస్‌వో పుష్పలత, బీఎల్వోలు పాల్గొన్నారు.

టైలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

అద్దంకి, ఫిబ్రవరి 28 : టైలర్ల సమస్యలను తెలుగుదేశం, జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిష్కరిస్తుందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగినేని రామకృష్ణ అన్నారు. టైలర్స్ డే సందర్భంగా అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రసన్నాంజనేయ కాంప్లెక్స్‌లో జెండాను ఆవిష్కరించారు. అనంతరం షాదీఖానా వరకు ర్యాలీ నిర్వహించారు. విలియమ్ హోవే, కేఎం స్వామి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం షాదీఖానాలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ సహకారంతో ఆరుగురు పేద టైలర్లకు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. టీడీపీ జిల్లా వైద్య విభాగం అధ్యక్షుడు డాక్టర్ చదలవాడ ఫణీంద్రబాబు, టీడీపీ నేతలు సారథి, చిన్ని శ్రీనివాసరావు, కాకాని అశోక్, వడ్డవల్లి పూర్ణచంద్రరావు, పోతిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ధర్మవరపు నరసింహారావు, కౌన్సిలర్లు కంపా రజనీ, అత్తులూరి రమేష్, జహీరా, అసోసియేషన్ అధ్యక్షుడు గోరంట్ల అచ్చయ్య, మదీనా, ఖాశిం, వలి, కరిముల్లా పాల్గొన్నారు.


విలియమ్స్ హోవే, కెఎంస్వామిల చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు, టైలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు